## విలేఖరులు కావలెను

ప్రతికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:347 | బుధవారం జూలై 22, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


## పనుల్లో అలస్యత్వం వహిస్తే
# సహించను
### సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు హెచ్చరిక

- ఎడ్యుకేషన్ హబ్ పనుల్లో ఆలస్యం వహిస్తే సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు.
- వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లోని ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు సీఎం రేవంత్ రెడ్డి.



పనులు చేయని అధికారులను సస్పెండ్ చేయండి

**సీఎం కీలక వ్యాఖ్యలు**

- పనులు కాగితాల్లో కాకుండా చేతల్లో చూపించాలి.
- ఆలస్యం వహిస్తే సహించేది లేదు.
- పురోగతి కనిపించకుంటే నేను ప్రజలకు జవాబు చెప్పుకోవాలా?
- ప్రతి నెల ప్రగతి పనులను ఇక్కడే ఉండి పర్యవేక్షిస్తాను.

సీరియస్ ఆదేశాలు

**హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ -- భవిష్యత్ విద్యకు కేంద్రబిందువు**





ప్రపంచస్థాయి విద్యా సదుపాయాలు | వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు | తెలంగాణను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

బొంరాస్‌పేట: ఎడ్యుకేషన్ హబ్ పనుల్లో అలసత్వం వహిస్తే సాహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనులు కాగితాల్లో కాకుండా చేతల్లో చూపించాలన్నారు. పనులు చేయని అధికారులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. తాను ప్రజలకు జవాబు చెప్పుకోవాలని, పురోగతి కనిపించకుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రతి నెలా ప్రగతి పనులను ఇక్కడే ఉండి పర్యవేక్షణ చేస్తానని సీఎం అన్నారు. ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం వెంట ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కలెక్టర్‌లు దీపక్ తివారి, ప్రియాంక, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి ఉన్నారు.

> "ప్రజలకు జవాబు చెప్పుకోవాలనే ప్రతి నెల ప్రగతి పనులను ఇక్కడే ఉండి పర్యవేక్షిస్తాను. ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలి."

## ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు

### ఏపీ ఈడీబీతో యూఏఈ కీలక అవగాహనా ఒప్పందం





- ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారీ పెట్టుబడులకు మార్గం సుగమం
- తొలి అడుగుగా చిత్తూరులో రూ.100 కోట్లతో యూనిట్
- చంద్రబాబు, యూఏఈ మంత్రి అబ్దుల్లా సమక్షంలో ఎంఓయూ
- ఉద్యాన ఉత్పత్తుల అంతర్జాతీయ ఎగుమతులకు ఊతం
- రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామన్న సీఎం
- ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

**అమరావతి, జూలై 21**

ఆంధ్రప్రదేశ్‌లో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఏపీ ఈడీబీ, యూఏఈ ఫుడ్ క్లస్టర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఈ ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఏపీలోని ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు అవకాశాలు మెరుగవుతాయి.

**తొలి పెట్టుబడిగా చిత్తూరులో యూనిట్**

ఒప్పందంలో భాగంగా యూఏఈకి చెందిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో రూ.100 కోట్ల పెట్టుబడితో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఇక్కడి నుంచి ప్రపంచ శ్రేణి ఉత్పత్తులను తయారు చేసి దాదాపు 25 దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు ప్రకటించింది.

**త్వరితగతిన సాకారమైన దావోస్ హామీలు**

దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో కుదిరిన ప్రాథమిక చర్చలు ఆరు నెలల్లోనే ఒప్పంద రూపం దాల్చడం పట్ల సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు.

2లో

## "మామ".. నువ్వు నాటిన
## మొక్కలకే నీరు, రక్షణ కరవాయే..!!





కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ పాటిల | ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు | ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



నాటిన చేతులే మరిచాయి

**ఎండిపోతున్న విపిజి రాంజీ మొక్కలు..**

సెంట్రల్ మినిస్టర్ శివరాజ్ సింగ్ పాటిల్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా నాటిన..
"వి పి జి రాంజీ".. మొక్కలకు సంరక్షణ కరవాయె
తిరుపతి జిల్లా కలెక్టర్ సారు..!!

నిద్ర పోతున్నా ఎంపీడీవో... పంచాయతీ అధికారులు...!!





ఇప్పటికైనా స్పందించి..
ఎండిపోతున్న ఆ మొక్కకు తక్షణమే నీటి సాకర్యం కల్పించి కాపాడాలి...

పరిసరాల ప్రేమికుల కొరకు

మిగతాది 2లో

## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

### ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు.

2లో

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

### సాగు,తాగునీటి సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు
### డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి




2లో

# సంపాదకీయం

## వాంగ్‌చుక్... ఆ గళాలన్నీ గప్‌చుప్!

ఆ ఇరువురూ ధర్మ యోధులు. పాలనావ్యవస్థలో అవినీతికి, అసమర్థతకు వ్యతిరేకంగా ప్రాణత్యాగానికి సాహసించి నిరవధిక నిరాహార దీక్షలతో ప్రభుత్వాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీరులు. వారి ధర్మ పోరాటాల మధ్య కాల విరామం పదిహేను సంవత్సరాలు మాత్రమే. వాటి కథలు భిన్నమైనవి. దేశ రాజకీయాలలో, ప్రజా దృక్పథాల్లో ఒక స్పష్టమైన మార్పును అవి సూచిస్తున్నాయి.

ఆ నైతిక యోధులలో ఒకరు అన్నా హజారే. 1990ల్లో మహారాష్ట్రలో సమాచార హక్కు చట్టం కోసం, అవినీతిపరులైన అధికారులపై చర్యలను డిమాండ్ చేస్తూ ఆయన అనేక ఆందోళనలు, నిరాహార దీక్షలు నిర్వహించారు. వాటికి పరాకాష్ఠ జన్‌లోక్‌పాల్ ఉద్యమం. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని అరికట్టేందుకు లోక్‌పాల్ వ్యవస్థను నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5, 2011న ఆయన నిరాహారదీక్షకు ఉపక్రమించారు. నాలుగు రోజుల పాటు సాగిన ఆ పోరాట దీక్ష, జన్ లోక్‌పాల్ బిల్లు ముసాయిదా రూపకల్పనకు ఒక సంయుక్త సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో ముగిసింది. తిరిగి అదే ఏడాది ఆగస్టు 16న న్యూఢిల్లీలోని సుప్రసిద్ధ రామ్‌లీలా మైదానంలో అన్నా మళ్లీ నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఆయన డిమాండ్లకు అనుకూలంగా పార్లమెంటు ఒక తీర్మానాన్ని ఆమోదించడంతో అన్నా దీక్ష పన్నెండవ రోజున (ఆగస్టు 28) ముగిసింది. లోక్‌పాల్ కోసం నిర్వహించిన దీక్షలతో ఆయన ఆసేతు హిమాచలం ఆబాలగోపాలానికి సుపరిచితుడు అయ్యారు.

అన్నా హజారే డిమాండ్ సాపేక్షంగా నిరపాయకరమైనది. అవినీతిని నిర్మూలించేందుకు గట్టిచర్యలు చేపట్టేందుకు జాతీయస్థాయిలో స్వతంత్ర లోక్‌పాల్ వ్యవస్థను సృష్టించాలనేది ఆయన డిమాండ్. అవినీతి అనేది చాలామంది పాల్పడుతున్నదే కదా అనే ఉదాసీనత దేశంలో అవినీతి పెచ్చరిల్లిపోయేందుకు దారితీస్తోంది. అందరూ చట్టోల్లంఘనకు పాల్పడుతున్నప్పుడు తాను ఒక్కణ్నే చట్టానికి కట్టుబడి ఉండడం వల్ల ప్రయోజనమేముంది అన్న ఆలోచనతో అత్యధికులు అవినీతికి కారకులవుతున్నారు. పైగా, అన్నాహజారే నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్న సందర్భంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అనేక కుంభకోణాలతో అప్రతిష్ఠ పాలయివున్నది. ప్రభుత్వ ప్రమేయమున్న ప్రతి వ్యవహారంలోను అవినీతి చోటుచేసుకున్నదని ప్రజలు విశ్వసించిన కాలమది. దీంతో, అన్నా ఆందోళనకు అశేష ప్రజల మద్దతు లభించింది.

రామ్‌లీలా మైదానంలో అన్నా హజారే నిరాహార దీక్షకు మద్దతు తెలిపేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలి రావడాన్ని టెలివిజన్ చానెల్స్ ప్రత్యక్ష ప్రసారం చేశాయి. వృత్తి విధులను నైతిక నిష్ఠతో నిర్వహించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీ లాంటి వారే కాకుండా యోగా గురువు బాబా రామ్‌దేవ్ లాంటివారు కూడా అన్నా ఉద్యమానికి సంపూర్ణ మద్దతునిచ్చారు. అవినీతిని తాము ఎంత చిత్తశుద్ధితో వ్యతిరేకిస్తుందీ చాటుకోవడానికి అన్నా ఉద్యమానికి మద్దతునివ్వడం ఒక ప్రయోజనకరమైన మార్గమని అనేకానేకమంది విశ్వసించారు. అయితే, అన్నా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన అసలు శక్తి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. దేశవ్యాప్తంగా శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న ఈ సంస్థ తన అసంఖ్యాక కార్యకర్తలను అన్నా ఉద్యమాగ్నులు మరింతగా ప్రజ్వరిల్లేలా చేసేందుకు నియోగించింది. నర్మదాసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించిన మేధా పాట్కర్; సోషలిస్టు మేధావి యోగంద్ర యాదవ్, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మొదలైనవారు కూడా హజారే ఉద్యమానికి సంపూర్ణ మద్దతునిచ్చారు. అయితే ఆ ఉద్యమ అంతిమ విజేత మట్టుకు భారతీయ జనతా పార్టీ. 2014 సార్వత్రిక ఎన్నికల ఫలితాలే అందుకు తిరుగులేని నిదర్శనం.

అన్నా ఉద్యమ ఉధృతిలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికీ ఒక పాత్ర ఉన్నది. ఉద్యమ జటిలతను మన్మోహన్ సర్కార్ తొలుత అర్థం చేసుకోలేదు. ఆ క్లిష్ట పరిస్థితి అర్థంకాగానే అన్నాతో 'సంప్రదింపులు' జరిపేందుకు కేబినెట్ మంత్రులు ప్రణబ్ ముఖర్జీ, ఏకే ఆంటోనీలతో పాటు మరో ఇద్దరు ప్రముఖుల సహాయాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకుంది. ఒకరు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విలాసరావు దేశ్‌ముఖ్, మరొకరు 'నాబార్డ్' మాజీ చీఫ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర సారంగి. హజారేతో చర్చలు సఫలమయేందుకు ఈ ఇరువురూ విశేషంగా తోడ్పడ్డారు. ప్చ్, ప్రయోజనమేముంది? అప్పటికే యూపీఏ సర్కార్ చేతుల్లోంచి కాలం జారిపోయింది. అరేబియా జానపద గాథలో వలే సీసా నుంచి భూతం బయటపడింది, మళ్లీ దాన్ని సీసాలో బంధించడం అసాధ్యమైపోయింది.

పర్యావరణ పరిరక్షణ యోధుడు, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష అన్నాహజారే ఆందోళనకు పూర్తి భిన్నమైనది. ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది-- వాంగ్‌చుక్ డిమాండ్ నిర్దిష్ట వాస్తవికత ఆధారంగా చేసింది. జాతీయస్థాయి ప్రవేశపరీక్షలో అవకతవకలతో కోట్లాది విద్యార్థినీ విద్యార్థులు లోనైన కష్టనష్టాలకు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది కాక్రోచ్ జనతాపార్టీ డిమాండ్. దీనితో పోల్చితే అన్నా డిమాండ్ సైద్ధాంతికమైనది, సంకీర్ణమైనది. అన్నా, వాంగ్‌చుక్ డిమాండ్ల మధ్య వ్యత్యాసం ఆ ఇరువురి రాజకీయ చతురత మధ్య తారతమ్యతకు అద్దం పడుతుంది. హజారేకు ఉన్నత స్థాయిలో రాజకీయ సంబంధాలు ఉన్నాయి. ఆయనను ప్రభావితం చేయడమూ సులువైన విషయమే. అన్నాతో పోలిస్తే వాంగ్‌చుక్ దృఢ విశ్వాసాలు ఉన్న పోరాటకారుడు. ఆయన ఒకసారి ఒక నిర్ణయానికి వస్తే మరెవ్వరూ ఆయన్ని అందుకు విరుద్ధంగా వ్యవహరించేలా ప్రభావితం చేయలేరు. తన నిర్ణయం నెగ్గేంతవరకు పట్టుదలతో ఉండే యోధుడు ఆ హిమాలయ భారతీయుడు. అన్నా డిమాండ్‌ను నెరవేర్చితే ముంచుకొచ్చే ముప్పు ఏమీలేదు. ఎందుకంటే ఆ డిమాండ్ అంతిమంగా నిరుపయోగకరమైనది. వాంగ్‌చుక్ పోరాట లక్ష్యం కంటే అన్నా ఉద్యమ ఆశయాన్ని నెరవేర్చడం సులభం.

రెండోది-- వాంగ్‌చుక్‌కు ప్రతిపక్షాల మద్దతు లేకపోవడం. అన్నా ఆందోళన సందర్భంలో ఆనాటి ప్రతిపక్షం బీజేపీ ఆ ఉద్యమాన్ని తన రాజకీయ ప్రయోజనాల పురోగతికి ఒక అపూర్వ అవకాశంగా పరిగణించింది. మన్మోహన్ సర్కార్ పాలనలోని అవినీతిని ఎండగట్టేందుకు ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నది. వాంగ్‌చుక్ పోరు సందర్భంలో ప్రస్తుత ప్రతిపక్షం ఏమి చేస్తున్నది? స్తబ్ధుగా ఉండిపోవడమే కాదూ? ఈ మందకొడితనానికి కారణమేమిటి? ప్రతిపక్షాలు వేటికవిగా ఉండిపోవడమే. ఈ అనైక్యత వల్లే మోదీ సర్కార్‌ను సవాల్ చేసేందుకు వాటికొక సమైక్య, సుసంగత వ్యూహం లేకుండాపోయింది. వాంగ్‌చుక్ ఉద్యమ మనోరథం నెరవేరితే తమకు సమకూరే ప్రత్యక్ష ప్రయోజనమేదీ లేదని విపక్షాలు భావిస్తున్నాయి. అన్నా ఉద్యమం ప్రత్యక్ష లబ్ధిదారు బీజేపీ. అందుకే అది ఆనాడు ఆ ఆందోళనను అన్ని విధాలా ఎగదోసింది, లబ్ధి పొందింది. అన్నా హజారే బీజేపీ చేతుల్లో కీలుబొమ్మ. వాంగ్‌చుక్ అలా కాదు, ఆయన ఒంటరి యోధుడు.

హజారే ఆందోళనలో సమస్త భారతీయులూ అవినీతికి వ్యతిరేకంగా ముక్తకంఠంతో ఘోషించారు.. అవినీతి పాలకులను అధికారం నుంచి తొలగించేందుకు సమైక్యమయ్యారు. సినీ పరిశ్రమలోని హీరోలు, హీరోయిన్లతో పాటు అంతగా ప్రాధాన్యం లేని నటీనటులు కూడా అవినీతిని గర్హించారు, నాటి పాలకులపై ధ్వజమెత్తారు. మరి వాంగ్‌చుక్ ఉద్యమ సందర్భంలో ఆ గళాలు ఏవీ? ఆ లోకహితులు కానరాలేదేమీ? వ్యాపార దిగ్గజాలు, పారిశ్రామిక ప్రముఖులలో పలువురు ఆనాడు ఉదారంగా అన్నా ఉద్యమానికి బాసటగా నిలబడ్డారు. మోదీ ప్రభుత్వ నీడలో ఉన్న ఆ దిగ్గజాలు, ప్రముఖులు ఇప్పుడు ఆత్మపరిశీలనా యోగంలో నిమగ్నులై ఉన్నారు. కేవలం పదిహేను సంవత్సరాల వ్యవధిలో మన సజీవమైన, ఉద్వేగ భరితమైన, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం ఎంత నిశ్శబ్దంగా మారిపోయిందో కదా!

మౌనం, అంతటా మౌనం. ఈ మౌనాన్ని ప్రశ్నించేందుకు మనం సిద్ధంగా ఉన్నామా? మన ప్రజాస్వామ్యం సమస్త పౌరుల శ్రేయస్సును కోరే, దానిని సాధించే గొంతుకను మళ్లీ పొందేందుకు తోడ్పడుతుందా? ఈ ప్రశ్నలను జరూరుగా పరిష్కరించుకోవాలి. లేనిపక్షంలో ప్రస్తుత మౌనం మూగవారి నిశ్శబ్దాన్నే ప్రతిధ్వనిస్తుంది.

## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో ఎన్నో విపత్తులు ఎదుర్కొన్నామని.. ఎన్‌లినోను కూడా ఎదుర్కుంటామన్నారు. అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. సంవృద్ధిగా వర్షాలు పడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆషాఢమాస బోనాలు ఘనంగా జరిగేలా దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్ని ఏర్పాట్లు చేసినా చిన్న చిన్న ఇబ్బందులు జరుగుతుంటాయని.. వాటిని అధిగమించి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర మీద ఉండాలని, సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

మొదటిపేజీ తరువాయి

ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలంలోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

## ముడి పొగాకుపై జీఎస్టీ తగ్గించండి:

ముడి పొగాకు (సూచీ 2401)పై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం జీఎస్టీని 28 శాతానికి తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి, రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇది కేవలం ముడి పొగాకు (సూచీ 2401)కు సంబంధించిన అంశమని, తయారైన పొగాకు ఉత్పత్తులకు దీనికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జీఎస్టీ పెంపు కారణంగా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఖీజు పొగాకు విలువపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీని 40 శాతం నుంచి 28 శాతానికి తగ్గించాలని కోరారు. ఈ నిర్ణయం ద్వారా పొగాకు రైతులు, డీలర్లు, ఎగుమతిదారులకు ఉపశమనం లభించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో భారత పొగాకు ఎగుమతుల పోటీతత్వం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు.

## కాక్రోచ్ పార్టీ ఆందోళనపై కేంద్రం అప్రమత్తం

**విద్యార్థులతో చర్చించేందుకు సిద్ధమని సంకేతాలు**

**లాఠీఛార్జ్‌లో గాయపడ్డ విద్యార్థులను పరామర్శించిన జెపి నడ్డా**

న్యూఢిల్లీ,జూలై21: నీట్ ప్రశ్నపత్రం లీక్, విద్యా వ్యవస్థలో లోపాల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ సోమవారం చేపట్టిన 'చలో పార్లమెంట్' యాత్ర ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో సీజేపీ ఆందోళనకు శాంతియుత పరిష్కారం చూపే దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థి ప్రతినిధులతో చర్చలకు సిద్ధమని కేంద్రం ప్రకటించినట్లు సమాచారం. ఈ సమస్యలకు చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అందుకోసం ఆ దిశగా చర్యలు చేపట్టింది. విద్య మంత్రిత్వ శాఖ లేదా ఉన్నతాధికారుల స్థాయిలో విద్యార్థులతో సమావేశం నిర్వహించే ఆస్కారం ఉందని తెలుస్తోంది. దీంతో నీట్ నిర్వహించే పరీక్షా వ్యవస్థలో పారదర్శకతతో పాటు సంస్కరణల దిశగా ముందడుగు పడనుంది. సోమవారం చలో పార్లమెంట్ యాత్రలో విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని మంగళవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డా పరామర్శించారు. అనంతరం విద్యార్థులతో కేంద్రం చర్చలకు సుముఖంగా ఉందనే ప్రచారం ప్రారంభమైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్, పోటీ పరీక్షల్లో అవకతవకలతో పాటు పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థి లోకం భగ్గుమంది. దీంతో జాతీయ స్థాయిలో విద్యార్థుల నిరసనలు, నిరాహార దీక్షలు ఉధృతమయ్యాయి. దాంతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 'చర్చల కోసం తలుపులు తెరిచే ఉన్నాయని' కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరో వైపు ఈ అంశంపై ప్రధాని మోదీకి విద్యావేత్తలతో పాటు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఒంకోవైపు నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. మంగళవారం న్యూఢిల్లీలో మంగళ్ మిలన్ పేరిట ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ ఘోర పాపమని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఈ పేపర్ లీకులను నివారించడం జాతీయ బాధ్యత అని ప్రధాని మోదీ తెలిపారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సీజేపీ ప్రతినిధులు సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ 3 ప్రధాన డిమాండ్లతో కూడిన లేఖను కేంద్రమంత్రికి వారు అందజేసిన విషయం విదితమే. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తన ఎక్స్ వేదికగా వివరించిన సంగతి తెలిసిందే.

## హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు చేదు అనుభవం

**గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని సెక్యూరిటీ సూచన**

**రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు ఆగ్రహం**

హైదరాబాద్,జూలై21: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చేదు అనుభవం ఎదురైంది. వీఐపీలు ప్రవేశించే గేట్ నంబర్ 6 నుంచి కాకుండా, సామాన్య ప్రజలు ప్రవేశించే గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని రంగనాథ్‌కు సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో గేట్ నంబర్ 4 వద్ద సామాన్య ప్రజలు వాహనాలు పార్క్ చేసే స్థలంలో కారు పార్క్ చేసి, అక్కడి నుండి నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లారు.

కాగా, ప్రైవేట్ ఆస్తి వివాదంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒకే అంశానికి సంబంధించి ఏకంగా మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవడం అత్యంత తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం వెనుక కారణమేమిటని నిలదీసింది. ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని స్పష్టమైన ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని లెకచేయకుండా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన అలవాటుగా మారిందా? కోర్టు ధికరణనే పరిపాటిగా మార్చుకున్నారా? అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకటి కాదు, రెండు కాదు, ఒకే అంశంపై మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవుతున్నా యంటే కోర్టు ఉత్తర్వుల పట్ల ఎంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతున్న దని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టుల పట్ల ఎంత గౌరవం ఉన్నదో ఈ పరిణామాలే చెప్తున్నాయని పేరొంది. ఇకడ బాధితుడు పిటిషనర్ కాదని, స్వయంగా కోర్టేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వులను ధికరించడం ఎంతమాత్రం సహించబోమని రంగనాథ్‌కు తేల్చిచెప్పింది. ప్రభుత్వమైనా, ప్రభుత్వాధికారులైనా చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేసింది.

నీటి వనరులు, నాలాలు, కాలువల పరిరక్షణ పేరుతో కోర్టు ఉత్తర్వులను పకనపెట్టి ప్రైవేటు భూముల్లోకి వెళ్లడం ఏ చట్టం ప్రకారం సమర్థనీ యమని ప్రశ్నించింది. యజమాని అనుమతి లేకుండా ప్రైవేటు భూమిలో అడుగు పెట్టరాదన్న ప్రాథమిక సూత్రం తెలియదా అని నిలదీసింది. ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యమైతే ప్రైవేటు వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు ఎందుకు చేశారని

## ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి

ఉద్యాన, ఆక్వా రంగాల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, రాష్ట్ర స్థూల ఆదాయంలో 30 శాతం వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల నుంచే వస్తోందని వివరించారు.

**ఉద్యాన హబ్‌గా రాయలసీమ**

రూ.లక్ష కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. రిలయన్స్ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని తెలిపారు.

**క్వాంటం స్పీడ్‌తో పెట్టుబడుల సాధన**

రాష్ట్రంలో పోర్టులు, రైల్వే, రోడ్డు మార్గాల అనుసంధానంతో ఏపీ లాజిస్టిక్స్ కేంద్రంగా మారిందని చంద్రబాబు వివరించారు. అమరావతిని పర్యావరణ అనుకూల నగరంగా నిర్మిస్తున్నామని, పెట్టుబడిదారులు ఇక్కడ లభించే అవకాశాలను క్వాంటం స్పీడ్‌తో అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

**ఏపీ-యూఏఈ ఫుడ్ కారిడార్**

నదులు, విస్తృత వనరులు ఉన్న ఏపీని విజనరీ నేత చంద్రబాబు అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని యూఏఈ మంత్రి అబ్దుల్లా ప్రశంసించారు. ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, 21 రోజుల్లోనే అనుమతులు ఇచ్చే విధానం వ్యాపారానికి ఎంతో అనుకూలమని తెలిపారు.

**ఎగుమతులకు కృష్ణపట్నం, కాకినాడ పోర్టులు**

అమరావతి నుంచి న్యూయార్క్ వరకు డెయిరీ, సీఫుడ్, పప్పు దినుసుల ఎగుమతులపై దృష్టి సారిస్తామని యూఏఈ మంత్రి తెలిపారు. కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల నుంచి వాణిజ్యం మరింత పెరిగేలా సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో రాహుల్ గాంధీ..

పోలీసులు అదుపులోకి తీసుకొని తరలించే క్రమంలో ఆయన ముక్కు నుంచి రక్తం కారుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

**మందిర్ మార్గ్ పీఎస్‌కు చేరుకున్న సోనియా గాంధీ**

రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు.

అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**డిమాండ్లపై రాహుల్ మాట మార్చారు: కేంద్రమంత్రి జితేంద్రసింగ్**

డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. "నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ధి కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు"అని జితేంద్రసింగ్ అన్నారు.

## భక్తుల రద్దీ.. తిరుపతిలో దర్శన టోకెన్ల జారీ రద్దు

తిరుపతి (తితిదే): భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో గురువారం దర్శనానికిగాను తిరుపతిలోని మూడు కేంద్రాల వద్ద బుధవారం జారీచేసే ఎస్ఎస్‌డీ టోకెన్లను రద్దు చేశారు. శుక్రవారం దర్శనానికిగాను గురువారం మధ్యాహ్నం నుంచి యథావిధిగా టోకెన్లు జారీ చేయనున్నారు. టోకెన్లు రద్దు చేయడం ఇది వరుసగా నాలుగోవారం కాగా సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు అవస్థలు పడుతున్నారు. బుధవారం దర్శనాలకుగాను మంగళవారం వేకువజామున ఐదుగంటలకే పదివేల సమయ నిర్దేశ (ఎస్ఎస్‌డీ) టోకెన్లు జారీ చేశారు. మెట్టు మార్గంలోని భక్తులకు మరో రెండువేల టోకెన్లు జారీ చేశారు. గంటలోపే కోటా పూర్తవడంతో వెనుక ఉన్నవారు, తరువాత వచ్చినవారు కేంద్రాల వద్దే పెద్దఎత్తున నిరీక్షించారు. ఎన్నో వ్యయప్రయాసలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సర్వదర్శన టోకెన్లు జారీ చేయకపోవడం సరికాదంటూ విమర్శలు గుప్పించారు. అనంతరం నేరుగా తిరుమలకు పయనమయ్యారు.

## "మామ".. నువ్వు నాటిన మొక్కలకే నీరు, రక్షణ కరువాయే..!!

మొదటిపేజీ తరువాయి

**సెంట్రల్ మినిస్టర్ శివరాజ్ సింగ్ పాటిల్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా నాటిన.. "వి పి జి రాంజీ".. మొక్కలకు సంరక్షణ కరువాయే తిరుపతి జిల్లా కలెక్టర్ సారు..!! నాటిన చేతులే మరిచాయి..!! ఎండిపోతున్న విపిజి రాంజీ మొక్కలు.. నిద్ర పోతున్నా ఎంపీడీవో... పంచాయతీ అధికారులు...!!**

**తిరుపతి జిల్లా ఇన్చార్జి న్యూస్ జూలై 21 జనసముద్రం న్యూస్**

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం లోని ఓబులవారిపల్లి మండలం మంగంపేట, ముక్క వారి పల్లి గ్రామపంచాయతీలో జరిగిన..ప్రతిష్టాత్మక విపిజి రాంజీ పథక ప్రారంభోత్సవ వేళ ఆర్భాటంగా నాటిన మొక్క ప్రస్తుతం సంరక్షణ కరువై చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ముక్కావారిపల్లి గ్రామంలో నిర్వహించిన జాతీయ స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా పాల్గొని ఈ మొక్కలు నాటారు...

?కార్యక్రమం ముగిసిన అనంతరం స్థానిక యంత్రాంగం ఆ మొక్క సంరక్షణను పూర్తిగా గాలికొదిలేసింది...!! వేసవి తీవ్రతకు తోడు కనీసం నీరు పోసే నాథుడు లేకపోవడంతో పచ్చని మొక్క కాస్తా ఎండిపోయి విగతజీవిగా మారుతోంది.?గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన ఈ బృహత్తర పథకం వేదికపై, విఐపిలు నాటిన మొక్కకే ఈ దుస్థితి పడితే..!! ఇక క్షేత్రస్థాయిలో నాటే ఇతర మొక్కల పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు... ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎండిపోతున్న ఆ మొక్కకు తక్షణమే నీటి సౌకర్యం కల్పించి కాపాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు...

జనసముద్రం

బుధవారం జూలై 22, 2026

# రైతుల స్వయం ప్రతిపత్తి సంస్థలుగానే పిఏసిఎస్ కొనసాగాలి: హింగే భాస్కర్



**ఎల్కతుర్తి జులై 21(జనసముద్రం)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసి ఎస్) నిర్వహణలో రైతుల ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ రాజకీయ జోక్యాన్ని పెంచడం అత్యంత బాధాకరమని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు హింగే భాస్కర్ అన్నారు.రైతుల ఆర్థికాభివృద్ధి, పంట రుణాలు, ఎరువులు, విత్తనాల పంపిణీ, ధాన్యం కొనుగోలు వంటి కీలక సేవలను అందించే సహకార సంఘాలు రైతుల సొంత సంస్థలని ఆయన పేర్కొన్నారు. అలాంటి సంస్థలను రాజకీయ నాయకుల పునరావాస కేంద్రాలుగా మార్చడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.సహకార సంఘాల పాలకవర్గాలను రైతులే స్వేచ్ఛగా ఎన్నిక చేసుకునే అవకాశాన్ని కల్పించాల్సిన ప్రభుత్వం, నామినేటెడ్ పదవుల ద్వారా రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చేందుకు ప్రయత్నించడం ఖండనీయమన్నారు. రైతుల సంక్షేమాన్ని పక్కనబెట్టి రాజకీయ నిరుద్యోగులకు పదవులు కట్టబెట్టే ధోరణిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.సహకార సంఘాలు రాజకీయాల కోసం కాకుండా రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని, వాటి స్వయం ప్రతిపత్తిని కాపాడాలని కోరారు.రైతుల అభిప్రాయాలను గౌరవిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి, సహకార సంఘాల పాలన రైతుల చేతుల్లోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రైతుల హక్కులకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తెలంగాణ రైతు రక్షణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కలిసి ఉద్యమాలు చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని హింగే భాస్కర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, నాయకులు కొదరే మాధవరావు, సుధాకర్ రావు, శ్రీనివాస్, భాష, పోయిన కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆరోపణలు అవాస్తవం.. ప్రజలు నమ్మరు: కాంగ్రెస్ నాయకులు

**●అభివృద్ధి,సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ముప్పు శ్రీనివాస్**

**ఎల్కతుర్తి, జూలై 21(జనసముద్రం)**



హనుమకొండ జిల్లా
ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్, నిరుద్యోగం అంశాలపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని అన్నారు.పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేయడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ద్వారా ప్రజాధనాన్ని వృథా చేసిందని ఆరోపించారు.ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు "దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయి" అంటూ ఎద్దేవా చేశారు.పీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకేనని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా రైతులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.నిరుద్యోగ యువతను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు నిరాశకు గురిచేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పారదర్శకంగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, వివిధ గ్రామాల కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ సర్పంచులు, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భద్రకాళి ఆలయం శాకంభరీ నవరాత్రుల్లో ఏడో రోజు వైభవంగా పూజలు

**●అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి**

**హనుమకొండ జులై 21(జనసముద్రం)**





వరంగల్ మహానగరంలోని పరమపావన పుణ్యక్షేత్రం శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు సోమవారం ఏడో రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా ఉదయం నిత్యాహ్నికాల అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తులను కాళీ క్రమంలో ఉగ్రా నిత్యా, షోడశీ క్రమంలో శివదూతి మాతగా విశేషంగా అలంకరించి పూజారాధనలు నిర్వహించారు.మంగళవారం సందర్భంగా భక్తులందరికీ శుభప్రదం కలగాలని ఆలయ అర్చకులు ముందుగా సుబ్రహ్మణ్య ఆరాధన నిర్వహించారు. ఉగ్రతారగా కూడా పిలువబడే ఉగ్రామాతను ఆరాధించడం వల్ల సామ్రాజ్యైశ్వర్యం, శత్రువులపై విజయం కలుగుతాయని, శివదూతి అమ్మవారిని సేవించడం వల్ల అపరిష్కృత వ్యవహారాలు చక్కబడతాయని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన జన్మదినోత్సవం సందర్భంగా కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ఆయన దంపతులకు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రాలు అందజేశారు.అలాగే వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి అమ్మవారిని దర్శించుకోగా, డోర్నకల్ ఎమ్మెల్యే డా. జటోత్ రామచందర్ నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికి కూడా అర్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రాలు సమర్పించారు.ఈ రోజు సుమారు 10 వేల మంది భక్తులు శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా భక్తులకు దధ్యోదనంతో పాటు శనగపిండితో తయారు చేసిన ప్రత్యేక హల్వా ప్రసాదం పంపిణీ చేశారు. ఈ వివరాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామల సునీత వెల్లడించారు.

# రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలి,

**●తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 21, 2026:**





జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి అదనపు కార్యదర్శి ఇలంబర్తి, శాంతి భద్రతల అధికారులు, రవాణా, రహదారి భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, రవాణా, రహదారులు భవనాల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు ప్రతినెల నిర్వహించాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.
మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రహదారి భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించి భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామని, రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మంచిర్యాల డి.సి.పి. ఎ.భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

**జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.**



కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి. ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, జిల్లా నాయకులు వస్పుల మానయ్య, సర్పంచ్ మండ్లి రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, లౌకిక విలువల సాధనకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మల్లికార్జున ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్, సీనియర్ నాయకులు తెల్గమల్ల జగన్, కృష్ణ నాయక్, అప్పం శ్రీను, కాలే మల్లయ్య, గాజుల శ్రీను, సీత పెద్దయ్య, ఖాదర్ ఖాద్రి, గాజుల సురేష్, ఎంగలి ప్రసాద్, అబ్దుల్ అలీమ్, కొండల్ రెడ్డి, విజయ్ నాయక్, షర్పుద్దీన్, దేవరశెట్టి మహేష్, కిషన్ నాయక్, దుడ్డు కృష్ణ యాదవ్, రాజు, నాజర్, రఫీ, లోక్య నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు

# కృత్రిమ మేధస్సు (ఏఐ)పై ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ ప్రారంభం





**●ఎల్కతుర్తి తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఎస్జీటీలకు ఎఫ్ఎల్ఎన్ రెమిడియేషన్ శిక్షణ**

**ఎల్కతుర్తి, జూలై 21(జనసముద్రం)**
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు తొలి విడతగా మూడు రోజుల ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ( ఎఫ్ ఎల్ ఎన్) రెమిడియేషన్ శిక్షణ కార్యక్రమం మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రారంభమైంది.ఈ శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్క్‌బుక్స్ ఆధారిత బోధన, ఆటల ద్వారా అభ్యాసం, కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, సమగ్ర మూల్యాంకనం వంటి అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల ప్రాథమిక చదవడం, గణిత నైపుణ్యాలను మరింత మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్‌గా శ్రీనివాస్, హర్షవర్ధన్ రెడ్డి, వంశీకృష్ణ, విజయతో పాటు సీఆర్పీ రవికుమార్ పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి సేవలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు.

**జనసముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.**



గట్టు ఇప్పలపల్లి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ బండల గడ్డ ఆంజనేయ స్వామి. దేవాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి. తన సతీమణి మాధవి రెడ్డితో. కలిసి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, యువతకు మంచి ఉపాధి అవకాశాలు లభించాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. అలాగే కల్వకుర్తి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నిర్విఘ్నంగా పూర్తికావాలని స్వామివారిని వేడుకున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, "ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ఆంజనేయ స్వామిని మనస్ఫూర్తిగా ప్రార్థించాను" అని తెలిపారు.
ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ఘనంగా సత్కరించారు.
ఎమ్మెల్యే ఆలయానికి చేరుకున్న సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రజలతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు

# కష్టానికి కిరీటం.. కట్కూరి సంపూర్ణకు ఉస్మానియా డాక్టరేట్

**ఎల్కతుర్తి, జూలై 21(జనసముద్రం)**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన కట్కూరి సౌందర్య--ఏసు దంపతుల పెద్ద కుమార్తె కట్కూరి సంపూర్ణ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకుని గ్రామానికి గర్వకారణంగా నిలిచారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం ఓరియంటల్ విభాగం డీన్ డాక్టర్ సిల్మా నాయక్ చేతుల మీదుగా ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు.అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. పద్మకుమారి పర్యవేక్షణలో "ఘండికోట హరిచందన రచనలు -- పరిశీలన" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు.ఈ కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులు డాక్టర్ బి. ప్రేమ్ కుమార్, డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి, డాక్టర్ కె. చంద్రశేఖర రావు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని సంపూర్ణను అభినందించారు.విద్యతో పాటు ఆత్మరక్షణలోనూ ప్రతిభ కనబరిచిన సంపూర్ణ పదో తరగతి చదువుతున్న సమయంలోనే కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించారు.సఫాయి కార్మికురాలిగా పనిచేస్తున్న తల్లి సౌందర్య, లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న తండ్రి ఏసు తమ కుమార్తెను ఉన్నత విద్యావంతురాలిగా తీర్చిదిద్దడం పలువురి ప్రశంసలను అందుకుంటోంది. సాధారణ కుటుంబం నుంచి డాక్టరేట్ సాధించిన సంపూర్ణ విజయాన్ని గ్రామ ప్రజలు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# భద్రాచలం రామాలయం ఆస్థాన పురోహితుని నియామకంలో వైదిక బ్రాహ్మణులకు న్యాయం చేస్తాము.

**●భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.**

**జనసముద్రం న్యూస్ జూలై 21 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.**



భద్రాచలం రామాలయంలో వశిష్ట సమానమైన ఆస్థాన పురోహితునిపోస్టు కు వైదిక బ్రాహ్మణులను ఎంపిక చేసే సాంప్రదాయం వందల సంవత్సరాలుగా (భక్త రామదాసు గారి కాలం నుండి) గత నుండి సాంప్రదాయంగా అమలు జరుగుతూ వస్తోంది. ఈమధ్య భద్రాచలం రామాలయంలో మత సంబంధమైన పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు దేవస్థానం వారు నోటిఫికేషన్ విడుదల చేయగా, మత సంబంధమైన పోస్టులలో ఆస్థాన పురోహితుని పోస్టు కువైదిక బ్రాహ్మణ సమాజం వారిని ఎంపిక చేయడం ఆనవాయితీగా వస్తుందని రామాలయం కార్యనిర్వాహణాధికారి వారికి భక్త రామదాసు గారి పుట్టినరోజు సందర్భంగా లిఖితపూర్వకంగా తెలియచేయడం జరిగింది. కొందరు స్వార్థపరుల కుట్రల కారణంగా వైదిక బ్రాహ్మణ సమాజానికిన్యాయం జరుగుతుందో లేదో అని భయంతో హైకోర్టును ఆశ్రయించ డం కూడా జరిగింది. అయినప్పటికీ కుట్ర దారుల భాగస్వామ్యంతో పురోహితునిగా అర్హతలు లేని వైదిక బ్రాహ్మనేతరుని ఎంపిక చేశారని సమాచారం బయటికి రావడంతో భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం వారు ఈ విషయంలో మాకు న్యాయం చేయమని మంత్రులకు, కమీషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ తో పాటు భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ను మంగళవారం మళ్లీ కలసి పూర్తి సమాచారం తెలియజేశాము. తన వద్దకు వచ్చినవెంకట రఘు పుంగవ దివ్య ప్రబంధ పారాయణం పోస్టు లో జాయిన్ అవుతామని చెప్పారని ఇందుకు విరుద్ధంగా పురోహితుని పోస్టులు జాయిన్ అయిన విషయం ఇప్పుడు మీరు చెప్పే వరకు మా దృష్టికి రాలేదని ఎమ్మెల్యే గారు తెలిపారు. ప్రభుత్వంతో, కమీషనర్ తో మాట్లాడి వైదిక బ్రాహ్మణ సమాజం అభ్యర్థిని ఆస్థాన పురోహితుని పోస్టు లో నియమించే విధంగా సహాయం చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని గత సాంప్రదాయంగా వందల సంవత్సరాలుగా ఆస్థాన పురోహితునిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వైదిక బ్రాహ్మణ సమాజానికి చెందిన అర్హత గల వారిని నియమించి మాకు న్యాయం చేయాలని పురోహితులు కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు రామావజల. రవికుమార్, కోవూరు. సుందర రామ శాస్త్రి, రాయప్రోలు, సత్యప్రసాద్ శర్మ, ఆర్ వీరభద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు,

**•మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 21, 2026: మంచిర్యాల**

జిల్లా వ్యాప్తంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామపంచాయతీ, లక్షెట్టిపేట, దండేపల్లి మండలం కర్ణపేట గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలల పరిసరాల పరిశుభ్రత, తరగతి గదులు, వసతి, భోజనశాల, వంటశాల, త్రాగునీటి వసతులు, విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యత, విద్యాబోధన, హాజరు రిజిస్టర్లు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తుందని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి బోధన, వసతులు, భోజన నాణ్యత, వసతిగృహ సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి



అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంపుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, స్కూల్ కాంప్లెక్స్ తదితర పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, వసతి గృహాలు, గ్రామాలలో పరిశుభ్రతను కట్టుదిట్టంగా నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. త్రాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా చూసి, క్లోరినేషన్ చేసిన సురక్షిత నీటిని ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు.



హాజీపూర్ మండల కర్ణమామిడి గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలో మురుగు కాలువల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని, వర్షాకాలంలో కూలిపోయే ప్రమాదంలో, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, అవసరమైతే ఆయా కుటుంబాలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

లక్షెట్‌పేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం సందర్శనలో పాఠశాల పరిసర ప్రాంతాలలో వీధిదీపాలు పనిచేయడం లేదని గుర్తించి, సంబంధిత విద్యుత్ శాఖ అధికారిని పిలిపించి వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ కమిషనర్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమాల్లో మండల పంచాయతీ అధికారి సుమన్, మండల విద్యాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ప్రత్యేక అధికారులు, సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భీమారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన రామగుండం పోలీస్ కమిషనర్,





**•చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: రామగుండం పోలీస్ కమిషనర్,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 21,2026:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని భీమారం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం రోజున రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఆకస్మికంగా తనిఖీ చేశారు. భీమారం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న రామగుండం పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి,విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు,సిబ్బంది పనితీరును సమీక్షించారు. అనంతరం స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. భీమారం ఎస్సై ఏ. రాజేందర్, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు,రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై ఆరా తీశారు. భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలో తరచుగా నమోదవుతున్న నేరాలు,పరిధిలోని గ్రామాల పరిస్థితులు, శాంతిభద్రతల పరిస్థితి,స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు.

5ఎస్ విధానంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితులకు,ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, నేరస్తుల ఇళ్లను తరచూ తనిఖీ చేయడంతో పాటు వారి కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే, తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి,ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు, సంస్థలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వారి వెంట జైపూర్ ఏసిపి ఆరే వెంకటేశ్వర్లు, జైపూర్ సీఐ కె. నవీన్ కుమార్, భీమారం ఎస్సై ఏ. రాజేందర్ ఉన్నారు

# సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు రోడ్డు భద్రత చర్యలను పకడ్బందీగా అమలు చేయాలి,

**• మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 21, 2026:**

సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు మంచిర్యాల జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని చర్యలను సమర్థవంతంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి డి.సి.పి. ఎ.భాస్కర్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై అనుమతించిన లే-బైలు, వే-సైడ్ సౌకర్య కేంద్రాలు మినహా ఇతర ప్రాంతాలలో భారీ, వాణిజ్య వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నిషేధిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దాబాలు, హోటళ్లు, వాణిజ్య సంస్థల సమీపంలో అక్రమంగా నిలిపే భారీ వాహనాల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నందున ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, రహదారులపై ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ వీధి దీపాలు, సి.సి కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ కంట్రోల్ చర్యలు, రంబుల్ స్ట్రిప్‌లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఇందారం వంతెన నుంచి గోదావరి వంతెన వరకు వీధి



దీపాల ఏర్పాటు, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిర్వహణ, యూ-టర్న్‌ల పున: వ్యవస్థీకరణ, రహదారుల షోల్డర్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. రహదారుల పర్యవేక్షణ కోసం అధునాతన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ, జి.పి.ఎస్. ఆధారిత నిఘా వ్యవస్థలను వినియోగించి ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించి ఈ-చలాన్ వ్యవస్థతో అనుసంధానం చేయాలని, అత్యవసర పరిస్థితులలో తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రతి 75 కిలోమీటర్లకు అంబులెన్స్, రికవరీ వాహనం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారి హక్కు పరిధిలో కొత్త దాబాలు, వాణిజ్య నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, ఇప్పటికే ఉన్న అనధికార నిర్మాణాలను తొలగించి రహదారుల భద్రతకు ఆటంకం కలిగించే ఆక్రమణలను నివారించాలని సూచించారు. రహదారుల సమీప భూవినియోగాన్ని నిబంధనల ప్రకారం నియంత్రించి ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను అరికట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాలలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలలో బాధ్యత పెంపొందించాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సుప్రీంకోర్టు



మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. మంచిర్యాల డి.సి.పి. ఏ భాస్కర్, మాట్లాడుతూ రహదారి భద్రతను మరింత బలోపేతం చేసేందుకు పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక హైవే సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్ వాహనాలు, అక్రమ పార్కింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రాహ్ వీర్ పథకం గురించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని సూచిస్తూ, రోడ్డు ప్రమాద బాధితులను ప్రమాదం జరిగిన తొలి గంటలో సమీప ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం అందజేస్తుందని తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు భయపడకుండా ముందుకు రావాలని, సమయానికి అందించే సహాయం అనేక ప్రాణాలను కాపాడగలదని తెలిపారు.ఈ కార్యక్రమంలో రవాణా, జాతీయ రహదారుల, రోడ్లు భవనాల, పోలీసు శాఖల అధికారులు, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈదురుగాలులకు కూలిన కుర్మేడు ముత్యాలమ్మ ఆలయ మహా వేపచెట్టు





**చింతపల్లి, జూలై 21 :జనసముద్రం న్యూస్ ప్రతినిధి**

చింతపల్లి మండలం కుర్మేడు గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన పురాతన మహా వేపచెట్టు సోమవారం అర్ధరాత్రి వీచిన బలమైన ఈదురుగాలులకు కూలిపోయింది. తరతరాలుగా గ్రామ ప్రజల ఆరాధనకు, భక్తుల విశ్రాంతికి, ఆలయ వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ మహావృక్షం నేలకొరగడం గ్రామస్థులను తీవ్ర భావోద్వేగానికి గురిచేసింది.గ్రామ పెద్దల కథనం ప్రకారం, ఈ వేపచెట్టు ఎన్నో దశాబ్దాలుగా ముత్యాలమ్మ తల్లి ఆలయానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. ప్రతి ఏడాది జరిగే జాతరలు, ప్రత్యేక పూజలు, గ్రామ వేడుకలకు వచ్చే భక్తులకు ఈ చెట్టు విశాలమైన నీడను అందించేది. గ్రామంలోని అనేక తరాలు ఈ చెట్టు నీడలోనే సమావేశాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అదృష్టవశాత్తూ చెట్టు రాత్రి సమయంలో కూలిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మంగళవారం ఉదయం ఆలయానికి చేరుకుని చెట్టును చూసి విచారం వ్యక్తం చేశారు. గ్రామ చరిత్రకు, ఆలయ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ మహా వేపచెట్టు కూలిపోవడం కుర్మేడు గ్రామానికి తీరని లోటుగా పలువురు అభిప్రాయపడ్డారు

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి,





**•తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 21, 2026:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అన్ని జిల్లాలలో వేగవంతంగా పూర్తి చేసి, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టికను ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణ వంటి ప్రక్రియలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ దరఖాస్తులను స్వీకరించి త్వరితగతిన పరిశీలించాలని తెలిపారు. అందిన ఫారాలు, దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాల వారీగా పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తూ, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను అధికారుల సమన్వయంతో వేగవంతం చేస్తున్నామని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సమన్వయంతో ప్రక్రియ వేగవంతానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి ఆలయంలో రాజగోపుర నిర్మాణానికి భూసార పరీక్షలు ప్రారంభం

**హనుమకొండ జులై 21 (జనసముద్రం(**

వరంగల్ నగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో ప్రతిష్ఠాత్మక రాజగోపురాల నిర్మాణానికి కీలక ముందడుగు పడింది.ఆలయానికి నాలుగు వైపులా మాడవీధుల అభివృద్ధిలో భాగంగా నిర్మించనున్న రాజగోపురాల కోసం భూసార (సాయిల్) పరీక్షలను మంగళవారం ప్రారంభించారు.దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మరియు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గత ఏడాది ఈ పనులకు శంకుస్థాపన చేశారు. కాకతీయ



శైలిలో పశ్చిమ దిశలో దేశంలోనే అత్యంత ఎత్తైన తొమ్మిది అంతస్తుల రాజగోపురం, తూర్పు దిశలో ఏడు అంతస్తుల రాజగోపురం నిర్మాణానికి ఇప్పటికే ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేశారు.నిర్మాణ స్థలం భూదృఢత్వాన్ని అంచనా వేయడానికి హైదరాబాద్‌కు చెందిన అంజీ జియో సొల్యూషన్స్ సంస్థకు బాధ్యతలు అప్పగించారు.సంస్థ సాంకేతిక నిపుణులు ప్రతి 1.5 మీటర్ల లోతులో మట్టి నమూనాలను సేకరించి మూడు రోజులపాటు భూసార పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నివేదిక ఆధారంగా రాజగోపురాల పునాది నిర్మాణ ప్రమాణాలను ఖరారు చేయనున్నారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ ఇంజినీరింగ్ సెల్‌కు చెందిన స్థపతి ఎడ్ల శివశంకర్, ఆలయ పర్యవేక్షకులు కూచన హరినాథ్, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషులు పాల్గొన్నారు.ఈ వివరాలను ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత వెల్లడించారు.

# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**జనసముద్రం న్యూస్ ప్రతినిధి మధిర జూలై 21**

స్థానిక భగత్ సింగ్ సెంటర్ నందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో విద్యార్థులపై నిరుద్యోగులపై జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించి అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు నిరుద్యోగులు సమస్యలను పరిష్కరించకుండా శాంతియుత పద్ధతిలో ఆందోళన నిర్వహిస్తున్న ఆందోళనకారులపై బాష్ప వాయు గోళాలు ప్రయోగించడం పోలీసుల ముసుగులో ఉన్న కొందరు బిజెపి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రజలపై రాళ్లు రివ్వుతూ



టెన్షన్ వాతావరణాన్ని సృష్టించి ఆందోళన కారులపై లాఠీలతో విరుచుకుపడ్డారని దీనిని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మందా సైదులు పట్టణ కార్యదర్శి పడకండి మురళి డివిజన్ నాయకులు పాపినేని రామ నరసయ్య ఓట్ల శంకర్రావు తేలపోలు రాధాకృష్ణ మల్లారం మాజీ సర్పంచ్ మందడపు ఉపేంద్ర ఎస్.కె ఉద్దండు సాహెబ్ అంగడాలఅమరయ్య మరియు పార్టీ నాయకులుమరియు పార్టీ నాయకులు కార్యకర్తలు

# మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేటలో ాX= కార్యక్రమాన్ని పరిశీలించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

**మెట్‌పల్లి, జూలై 21:**



మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట గ్రామంలోని బూత్ నంబర్--249లో నిర్వహిస్తున్న ా×= కార్యక్రమాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు గారు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ా×= కార్యక్రమంలో ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరికి అన్యాయం జరగకూడదని, ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి అర్హుడి ఓటు నమోదు అయ్యేలా పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు జంగిటి రాజేందర్ గారు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ సేవాదళ అధ్యక్షులు నాయిని సురేష్ గారు, బీఎల్ఏ--2 సతీష్ కుమార్ గారు, బీఎల్ఓ నరేష్ గారు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, సంబంధిత అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంక్షేమ సంఘం ఆవిర్భావం

**హనుమకొండ జులై 21 (జనసముద్రం)**





తెలంగాణ రాష్ట్రంలోని ధూప దీప నైవేద్య అర్చకుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంక్షేమ సంఘం సరస్వతి పరిషత్ భవన్‌లో ఘనంగా ఆవిర్భవించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ హాజరై నూతన సంఘాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ, ధూప దీప నైవేద్య అర్చకుల సంక్షేమమే సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సామాన్య అర్చకుడు ఎక్కడా దోపిడీకి గురికాకుండా వారికి అండగా నిలవాలని, అందరూ సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ధూప దీప నైవేద్య అర్చకులకు దేవాదాయ శాఖ ఉద్యోగులుగా గుర్తింపు, ఉద్యోగ భద్రత కల్పించే వరకు తన వంతు కృషి కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. సంఘ వ్యవస్థాపకుడు వెగ్గలం సంతోష్ మాట్లాడుతూ, గత ఎనిమిదేళ్లుగా అర్చకుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన పోరాటాన్ని కొనసాగిస్తూ, ఈ సంఘం ద్వారా అర్చకుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఓరుగంటి మాధవాచార్యులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత దేవాలయాల్లో సేవలందిస్తున్న అర్చకుల పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అతి తక్కువ గౌరవ వేతనంతో విధులు నిర్వహిస్తున్న అర్చకులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తాపాల వెంకటాద్రి మాట్లాడుతూ, అర్చకుల సమస్యల పరిష్కారంలో కొన్ని సంఘాలు ఆశించిన స్థాయిలో పనిచేయకపోవడంతోనే ఈ నూతన సంఘం ఏర్పాటైందన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అర్చకుల సమస్యలను వివరించి పరిష్కారం కోరనున్నట్లు తెలిపారు. సంఘ అధ్యక్షుడు అన్నవరిజల ప్రసాద్ శర్మ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ధూప దీప నైవేద్య అర్చకులను కలిసి వారి సమస్యలు, వినతులను సేకరించి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఇతర మంత్రులు, ముఖ్యమంత్రికి సమర్పిస్తామని తెలిపారు. సభలో రాష్ట్రవ్యాప్తంగా ధూప దీప నైవేద్య అర్చకుల సభ్యత్వ నమోదు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సుమారు 6,600 మంది అర్చకులను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించి పీఆర్‌సీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరాలని తీర్మానించారు. అలాగే అర్చకులకు ఆరోగ్య బీమా, దేవాలయాల సమీపంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ధూప దీప నైవేద్య అర్చకులు, సంఘ ప్రతినిధులు, ఆలయ అర్చకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి వేద ఆశీర్వచనాలతో జన్మదిన శుభాకాంక్షలు

**•ఘన సత్కారం చేసిన తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ**

**హనుమకొండ జూలై 21:జనసముద్రం**



వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి పట్టు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేశారు. చిరకాల మిత్రుడైన నాయిని రాజేందర్ రెడ్డి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అల్లుడు దేవర విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# ఓడీఓపీ కింద నెల్లూరు ఉత్పత్తులకు ప్రాధాన్యం

**•పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద సమాధానం**

**నెల్లూరు, జులై 21, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**



ఉదయగిరి చెక్క వస్తువులు, పాటూరు చీరలకు ప్రత్యేక గుర్తింపు

గ్లోబల్ మార్కెటింగ్, ఎగుమతుల ప్రోత్సాహకంపై కేంద్రం స్పష్టత

దేశంలో ప్రతి జిల్లా కేంద్రంగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' ( ఓ డి ఓ పి ) పథకం కింద పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు సంబంధించిన వివరాలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంటులో పలు ప్రశ్నలు లేవనెత్తారు. నెల్లూరు జిల్లా నుంచి ఉత్పత్తుల ఎంపిక, వాటి ఉత్పత్తి, విక్రయాలు, ఉపాధి కల్పన, ఎగుమతులకు కేంద్రం అందిస్తున్న సహాయంపై ఎంపీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయమంత్రి జితిన్ ప్రసాద మంగళవారం పార్లమెంటులో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ఎంపీ అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ... ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల నుంచి మొత్తం 99 ఉత్పత్తులను (26 ప్రాథమిక, 26 ద్వితీయ, 21 తృతీయ, 26 కేటగిరీ ఉత్పత్తులు) ఓడీఓపీ కింద గుర్తించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. నెల్లూరు జిల్లా నుంచి ప్రాథమిక ఉత్పత్తిగా ఉదయగిరి చెక్క భోజన సామగ్రి (ఉదయగిరి స్పూన్లు/చెక్క వస్తువులు)ని, ద్వితీయ ఉత్పత్తిగా పాటూరు కాటన్ సిల్క్ చీరలను ఓడీఓపీ పథకం కింద గుర్తించినట్లు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఓడీఓపీ కింద గుర్తించిన ఉత్పత్తుల ప్రచారం, విక్రయాల కోసం ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

దేశీయంగా, అంతర్జాతీయంగా నిర్వహిస్తున్న ప్రదర్శనల్లో ఈ ఉత్పత్తుల ప్రదర్శనకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం, పాయకరావుపేట పట్టు చీరల తయారీలో సుమారు 100 మంది చేనేత కార్మికులు నిమగ్నమై ఉన్నారని, ఓడీఓపీ కింద గుర్తించిన తర్వాత రూ.10.08 కోట్ల విలువైన ఉత్పత్తి నమోదైనట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

ఓడీఓపీ ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వ ఇ-మార్కెట్‌ప్లేస్ పోర్టల్‌లో ను ఏర్పాటు చేసి, ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించినట్లు వివరించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, విదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాల ద్వారా అంతర్జాతీయ కొనుగోలుదారులు-అమ్మకందారుల సమావేశాలు నిర్వహిస్తున్నామని, భారతదేశంలో జరిగే అంతర్జాతీయ, బహుళపక్ష సమావేశాల్లో ఓడీఓపీ ఉత్పత్తులను ప్రత్యేక బహుమతులుగా అందిస్తూ అంతర్జాతీయంగా గుర్తింపు తెస్తున్నట్లు చెప్పారు. అలాగే జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద జాతీయ, రాష్ట్ర స్థాయి ఎక్స్‌పోలు నిర్వహిస్తూ చేనేత రంగానికి మార్కెటింగ్ మద్దతు ఇస్తున్నామని, హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ( హెచ్చిసి ) సహకారంతో ఎగుమతికి తగిన ఉత్పత్తులను గుర్తిస్తున్నట్లు తెలిపారు.

ఎగుమతుల ప్రోత్సాహంలో భాగంగా, మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ ( ఎంపీడీఏ ) సమాచారం ప్రకారం.. 2024 ఆర్థిక సంవత్సరంలో దేశం మొత్తం రూ.71,070 కోట్ల (7.38 బిలియన్ అమెరికన్ డాలర్లు) విలువైన సీఫుడ్ ఎగుమతుల్లో, విశాఖపట్నం పోర్టు నుంచే రూ.21,090 కోట్ల (2.19 బిలియన్ అమెరికన్ డాలర్లు) విలువైన ఎగుమతులు జరిగాయని కేంద్ర మంత్రి వివరించారు. యాంటీబయాటిక్ రహిత నాణ్యమైన ఆక్వాకల్చర్ ఉత్పత్తులకు ఎంపెడా షాఫారీ ( మెసేజ్ చేపి ఎ ఆర్ ఐ ) సర్టిఫికేషన్‌ను అర్హులైన హేచరీలు, ఫీడ్ యూనిట్లకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సంప్రదాయ మత్స్యకారులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ( పి ఎం ఎస్ ఎస్ వై ) పథకం కింద పడవలు, వలలు అందించడం, సముద్రపాచి సాగు యూనిట్ల ద్వారా స్వయం సహాయక బృందాలను ( ఎస్ హెచ్ జి ఎస్ ) ప్రోత్సహించడం వంటి చర్యలు కూడా చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఓడీఓపీ పథకం కింద మరిన్ని ఉత్పత్తులను చేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రస్తుతం ఎలాంటి కొత్త ప్రతిపాదనలు అందలేదని కేంద్ర మంత్రి వెల్లడించారు.

# చర్చి రోడ్డు చౌరస్తాలో పేరుకు పోతున్న చెత్తాచెదారాలు.





**•ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని భద్రాచలంగ్రామ పంచాయితీ వారు.**

**జనసముద్రం న్యూస్ జూలై 21 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.**

చర్చి సెంటర్లో చౌరస్తా సమీపంలో చెత్త చెదారం పెద్ద ఎత్తున పే పేరుకుపోవడం, కళాంజలి బిల్డింగ్ నిర్మాణంలో పనికిరాని పదార్థాలను అక్క డే పడవేయడంతో ఆ పనికిరాని చెత్త ట్రాఫిక్ ఇబ్బందులు కూడా వస్తున్నాయని ఎన్నిసార్లు చెప్పినా గ్రామపంచాయతీ వారు పట్టించుకోవడంలేదని ఉద్యమ నాయకులుమేరీల సంఘం జిల్లా అధ్యక్షులైన తాళ్ల. రవికుమార్ ఉద్యమ నేత అల్లూరి. వెంకటేశ్వరరావు తెలిపారు.

ట్రాఫిక్ అధికంగా ఉం డే ఆ సెంటర్లో ఫుట్ పాత్ ప్రదేశాలను కూడా అద్దెలకు ఇచ్చుకుంటూ ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకుని అధికంగా పేరుకుపోతున్న చెత్తాచెదారాలను వెంటనే తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులను తొల గించాలని ఉద్యమ నాయకులు కోరారు

# మైనర్లకి వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం.. రైల్వే కోడూర్ "రూరల్ సీఐ".. హెచ్చరిక..!

**•ఎన్‌హెచ్-716 తిరుపతి--కడప జాతీయ రహదారిపై రహదారి భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించిన కోడూరు రూరల్ సీఐ డి శ్రీనివాసులు**

**తిరుపతి జిల్లా ఇన్చార్జి న్యూస్ జూలై 21 జన సముద్రం న్యూస్**





తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలో తిరుపతి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ గారి మరియు రేణిగుంట డీఎస్పీ ఆదేశాల మేరకు, కోడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాసులు పుల్లంపేటవద్దఎన్‌హెచ్-716 (తిరుపతి--కడప జాతీయ రహదారి) పై రహదారి భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, అతివేగంగా ప్రయాణించరాదని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని సూచించారు.

అదేవిధంగా మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు (ట్రిపుల్ రైడింగ్) ప్రయాణించడం ప్రమాదకరమే కాకుండా చట్ట విరుద్ధమని, అటువంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

# గూడూరు లో మెగా జాబ్ మేళఎంపికైనవారికీ నియామిక పత్రలు అందజేత.

**•ఎమ్మెల్యే టీడీపీ ప్రధాన కార్యదర్శి. పాశిం. సునీల్ కుమార్**

**నెల్లూరు, జూలై 21, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**



నిరుద్యోగు లకు ఉపాధి ఉద్యోగాఅవకాశాలు కల్పించడం కూటమి ప్రభుత్వం లక్ష్యం మని ఎమ్మెల్యే టీడీపీ ప్రధాన కార్యదర్శి. పాశిం. సునీల్ కుమార్ అన్నారు.

ఆయన మంగళవారం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గూడూరు లోని డి ఆర్ డబ్ల్యు డిగ్రీ కాలేజ్ ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహించరు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యవ గళం పాద యాత్ర లో మాట ఇచ్చిన హామీ ప్రకారమే 20లక్ష ల ఉద్యోగాలు ఇస్తా నని లోకేష్ చెప్పా రని. అదిఈ రోజునేరవేర్చి మని తెలిపారు. రాష్ట్రం లో మా కూటమి ప్రభుత్వం ఏర్పాడిన రెండు సం"లో గూడూరు నియోజకవర్గం లో 4 సార్లు జాబ్ మే ళ నిర్వహించమని. 7సార్లు మినీ జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగులు ఉద్యోగాఅవకాశలు కల్పించమన్నారు. గత ప్రభుత్వం లాగ మాటలు చెప్పే ప్రభుత్వం కాదని. మా ప్రభుత్వం పని చేసే ప్రభుత్వం మని రుజువు చేశారు. జాబ్ మేళాలో సుమారుగా 24 కంపెనీలు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలో నిర్వహించడం జరిగింది.

ఈ జాబ్ మేళాకు 401 మంది నిరుద్యోగులు పాల్గొనగా వీరిలో మంచి ప్రతిభ కనబరిచిన 291 మంది నిరుద్యోగులు ఉద్యోగానికి ఎంపిక కావడం జరిగింది. మరో 24 మందికి తదుపరి ఇంటర్వ్యూ కి పంపడం జరుగుతుంది. ఎంపిక కాబడిన నిరుద్యోగులకు ఆయా కంపెనీల ప్రతినిధుల ద్వారా నియామక ఉత్తర్వులు ను ఎమ్మెల్యే పాశిం. సునీల్ కుమార్ అందజేశారు .ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్ శ్రీ ఎం వినయ్ కుమార్ , సెట్నెల్ సీఈఓ శ్రీ ఎ నాగేశ్వర రావు , రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బి చెంచు రామయ్య తిరుపతి పార్లమెంటరీ అధికార ప్రతినిధి శ్రీ అబ్దుల్ రహీమ్ తెలుగు దేశం పార్టీ సెక్రటరీ శ్రీ హరి బాబు , జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం , వై టి సి మేనేజర్ ఎం బాలాజీ డీకే డబ్ల్యూ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ఎ ఇ పి హనుమంత రావు , డి ఆర్ డబ్ల్యూ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి గాయత్రి నెల్లూరు జిల్లా నైపుణ్య అభివృద్ధి సిబ్బంది మరియు సిడాప్ సిబ్బందికార్యక్రమంలోపాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేయాలి: ఎమ్మెల్యే మద్దిపాటి.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 21 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రకాశరావుపాలెం కార్యాలయంలో నల్లజర్ల మండల పరిధిలోని క్లస్టర్-8 కి చెందిన వివిధ గ్రామాల కూటమి నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయడంపై చర్చించారు. అలాగే రాబోయే స్థానిక ఎన్నికలకు శ్రేణులను సన్నద్ధం చేసే దిశగా దిశానిర్దేశం చేశారు. కూటమి నాయకులు సమన్వయంతో, పరస్పర సహకారంతో ముందుకు సాగితే విజయాలు మరింత సులభమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, క్లస్టర్ పరిధిలోని గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 21 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఉపాలయమైన లక్ష్మీపురం 'సంతానగోపాల శ్రీ జగన్నాథస్వామి' ఆలయంలో రథోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన మంగళవారం స్వామి వారు భక్తులకు అత్యంత విశేషమైన ' శ్రీ పరశురామా అలంకరణలో దర్శనమిచ్చి కనువిందు చేశారు. ఈ సందర్భంగా జగన్నాథస్వామి వారు, తన సోదర సోదరీమణులైన బలభద్ర, సుభద్రలతో కలిసి కొలువుదీరి భక్తులకు భక్తానుగ్రహాన్ని ప్రసాదించారు. స్వామి వారి ఈ అద్భుత అవతారాన్ని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తజనంతో, గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది.

# భక్తిప్రపత్తులతో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర హోమం...

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. జులై.21.**





మండల కేంద్రంలోని శ్రీ మద్గంగా పార్వతీ సమేత శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి దేవస్థానములో వందలాది మంది మహిళా భక్తులతో శ్రీ దశ లక్షా సంఖ్యాక లలితా సహస్ర నామపూర్వక కోటి కుంకుమార్చన మహా యజ్ఞము నిర్వహించారు. మంగళవారం మంగళ వాయిద్యములు, అభిషేకము, గోపూజ, శ్రీచక్రార్చన, బాలపూజ, సువాసినీ పూజ, భైరవ పూజలను వేద పండితులు వేద మంత్రోచ్చరణ నడుమ చేపట్టారు. అనంతరం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర హోమాన్ని వేద పండితులు చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొసరాజు వెంకటాద్రిచౌదరి(పెదబాబు), నిర్వాహకులు అన్నే ప్రసాదరావు, అడుసుమిల్లి వీరభద్రరావు, దేవస్థాన ఈఓ ఆర్.వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# జమ్మనపల్లిలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

●డా. షేక్ మహబూబ్ వలి సమక్షంలో 18కుపైగా కుటుంబాలు పార్టీలో చేరిక

**మార్కాపురం, జూలై 21 (జన సముద్రం న్యూస్)**

మార్కాపురం మండలం జమ్మనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఊతమిస్తూ 18కుపైగా కుటుంబాలకు చెందిన పలువురు డా. షేక్ మహబూబ్ వలి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం చైర్మన్ డా. షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలకు సముచిత గౌరవం కల్పిస్తూ రాజకీయంగా ఎదిగే అవకాశాలను అందరికీ సమానంగా కల్పిస్తుందని అన్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేరికల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పార్టీలో చేరిన వారందరికీ కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన ఆయన, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా జమ్మనపల్లి గ్రామ ప్రజలు డా. షేక్ మహబూబ్ వలిని ఘనంగా సన్మానించారు.

పార్టీలో చేరిన వారిలో కటికల మారకో, పాతర్ల వినయ్, మేకల దావీదు, మేకల సుదర్శన్, కటికల జానయ్య, మేకల సుధాకర్, కటికల లాజర్, మేకల రాంబాబు, మేకల శాంతమ్మ, మేకల చిన్ని, మేకల ఆదం, మేకల సంతోష్, మేకల దేవసహాయం, కటికల చిన్న దానియేలు, కటికల సాల్మన్, మేకల ఆనందరావు,



కృప, కటికల యేసు, పాతర్ల ఆదం, కటికల యాకోబు, కే. ఏసేబు, మేకల దేవదానం, గుడిమెట్ల దేవదానం, ఫార్మిపోగు దేవదానం, మేకల సామేలు, మేకల యాకోబు, శాంసన్, పి. దానయ్య, మేకల సురేష్, కే. ఏసు, మేకల ఆశీర్వాదం, కటికల ఇస్మాయిల్, కటికల గురువయ్య, కటికల జేమ్స్, కటికల జాన్, కే. దానియేలు యాకోబు తదితరులు ఉన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ మహబూబ్ సుభాని, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా ఊటుకూరు నాగార్జున్

**నెల్లూరు, జులై 21, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**



నెల్లూరు స్థానిక 13 వ డివిజన్ యలమవారిదిన్నె మెయిన్ రోడ్డు లో ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న ఇళ్లకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఉన్నపళంగా ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చిన సందర్భంగా వారికి అండగా నిలబడి ధైర్యం చెప్పి వారికి న్యాయం జరిగేవరకు వారి తరపున పోరాటం చేస్తానని భరోసా ఇచ్చిన 13 వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున తెలిపారు.

## ప్రమాదానికి నిలయంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..

●అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**నరసాపురం జూలై 21 జనసముద్రం ప్రతినిధి**





పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం గొంది గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగల చుట్టూ చెట్లు, పొదలు పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా చెట్ల కొమ్మలు, పొదల మధ్య చిక్కుకుపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని, ప్రమాదవశాత్తు ఎవరైనా విద్యుత్ తీగలను లేదా ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకితే ప్రాణాపాయం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లోని చెట్లు, పొదలను తొలగించి, విద్యుత్ తీగలను సురక్షితంగా ఏర్పాటు చేయాలని, ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా ముందస్తు చర్యలు తీసుకుని గ్రామస్తుల ప్రాణాలను కాపాడాలని స్థానికులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## 16వ రాష్ట్ర జూనియర్ హాకీ ఛాంపియన్‌షిప్‌కు ఘన ప్రారంభం

●హాకీకి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యం శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

**జనసముద్రం న్యూస్, కొయ్యాలగూడెం మండల రిపోర్టర్ ఈ.మనోహర్, జూలై 21,**





గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న 16వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ పురుషుల అంతర్‌జిల్లా ఛాంపియన్‌షిప్--2026 పోటీలను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి ప్రారంభించారు, హాకీ గుంటూరు జిల్లా అసోసియేషన్, స్మార్ట్ హాకీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జూలై 19 నుంచి 22 వరకు ఈ పోటీలు జరుగుతున్నాయి, ఈ సందర్భంగా కొవ్వాసు జగదీశ్వరి మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గ్రామీణ, జిల్లా స్థాయి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ఇటువంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు, హాకీ క్రీడకు పూర్వవైభవం తీసుకురావడంలో ఇలాంటి అంతర్‌జిల్లా పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు. యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## కప్పర్రు--మత్స్యపూరి జాతీయ రహదారిపై అక్రమ రవాణా జోరు

●చర్యలు చేపట్టడంలో అలసత్వం వహిస్తున్న అధికారులు

●ప్రయాణికులకు తలనొప్పిగా మారిన మట్టి మాఫియా

**నరసాపురం/ వీరవాసరం జూలై 21 జనసముద్రం ప్రతినిధి**



నరసాపురం మండలం కప్పర్రు--మత్స్యపూరి జాతీయ రహదారిపై అక్రమ రవాణా రోజురోజుకూ పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాల అక్రమ సరుకులను తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారిపై నిరంతర తనిఖీలు చేపట్టాల్సిన సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అక్రమ రవాణాపై పలు మార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని వారు అంటున్నారు. అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగే అవకాశం ఉండటంతో పాటు రహదారి భద్రతకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ రవాణా ట్రాఫిక్ వల్ల వివిధ అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## డిజిపి సి.వి. ఆనంద్ అధ్యక్షతన స్టాఫ్ ఆఫీసర్ల సమావేశం



తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా చేపట్టాల్సిన పలు కీలక అంశాలపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ అధ్యక్షతన స్టాఫ్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పోలీసు శాఖకు సంబంధించిన పలు విధానపరమైన, పరిపాలనా, సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఎస్ఆర్‌సీ (ాాజ) నివేదిక అమలు, మావోయిస్టు ముప్పు పేరుతో అవసరానికి మించి కల్పించిన భద్రతను ఉపసంహరించడం ద్వారా దాదాపు 400 మంది పోలీసు సిబ్బందిని, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావడం, శాఖలోని సిబ్బంది , వాహనాల ఆడిట్ మరియు అమలు విధానంపై సమీక్ష నిర్వహించారు.

అలాగే ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ యూనిట్లను ఒకే క్యాంపస్ నుంచి నిర్వహించే అంశం, తెలంగాణ పోలీసు మాన్యువల్ తుది రూపకల్పన, ఐపీఎస్ అధికారుల యూనిఫాంలో క్రాస్ బెల్ట్‌లు, లాఠీలు వంటి సంప్రదాయ అంశాల ప్రస్తుత అవసరంపై చర్చించారు.

తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (ౌ+ూా) సిబ్బందికి సంబంధించిన వివిధ సమస్యలు, వాటి పరిష్కారంలో ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయం, విజిలెన్స్, ఆహార కల్తీ నిరోధం, డ్రగ్ కంట్రోల్ వంటి రంగాల్లో కొత్త ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఏర్పాటు, ట్రాఫిక్ ఢ రోడ్డు భద్రత బ్యూరో ఏర్పాటు వంటి అంశాలను సమావేశంలో సమీక్షించారు.

ఇదే సందర్భంగా ప్రస్తుత సాంకేతిక అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీ మరియు కంప్యూటర్ సర్వీసెస్ విభాగాన్ని ఆధునీకరించడం, అలాగే సీసీటీఎన్ఎస్ 3.0 (జజుచీూ 3.0), టీజీ-కాప్ 3.0 (ౌ+-ఱూా 3.0), హాక్ఐ 3.0 (ఖుఒఐ జుఎవ 3.0) ప్రాజెక్టుల పురోగతిపై కూడా డీజీపీ సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో అధికారులు చేసిన సూచనలు, అభిప్రాయాలను పరిశీలించి, తెలంగాణ పోలీసు శాఖ భవిష్యత్ విధానాల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటామని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు.

## దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా నీళ్ల మంత్రికి తెలియదు

**మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**

జులై 12వ తేదీన తెలంగాణ భవన్‌లో ప్రెస్ మీట్ పెట్టి దేవాదుల పంపులు ఆన్ చేయమని నిలదీశాం. అని పేర్కొన్నారు 13వ తేదీన ఉత్తం, భట్టి, పొంగులేటి హెలికాప్టర్‌లో వెళ్లి హడావుడి చేశారు.అక్కడికి వెళ్లి దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా నీళ్ల మంత్రికి తెలియదు.మొత్తం 22 రిజర్వాయర్లు నింపుతాం, 38 టీఎంసీల నీళ్లు ఎత్తుతాం అని చెప్పారు. ఆ మాటలు నమ్మి రైతులు నారు పోసుకున్నారనీ ఇప్పుడు నీళ్లు ఇవ్వడం లేదు. నీళు ఎత్తడం లేదు.వరంగల్ జిల్లా వ్యాప్తంగా నీళ్ల కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారు. శాయంపేట, బీమదేవపల్లి, ఎల్కతుర్తి అంతటా ఆందోళనలు జరుగుతున్నాయన్నారు నీళ్లు ఉండి కూడా ఎందుకు ఎత్తడం లేదు?కేసీఆర్ గారు సమ్మక్క బ్యారేజీ కట్టారు. 3 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 22 వేల క్యూసెక్కుల వరద ఉంది.ఆయకట్టుకు సరిపడా నీళ్లు ఉండి కూడా పంటలకు నీళ్లు ఇవ్వడం లేదనీ పేర్కొన్నారు జులై 13న మొత్తం నీళ్లు ఎత్తుతామని చెప్పారు. ఏమైంది?పది పంపులు నడుస్తాయని చెప్పారు. నిన్నటి వరకు ఐదు పంపులే నడిచాయనీ మంత్రులు వెళ్లినప్పుడు ఏడు మోటార్లు, మంత్రులు లేనప్పుడు మూడు మోటార్లు నడుస్తున్నాయి.ఇక్కడ ఎన్డీఎస్ఏ అడ్డంకి లేదు కదా?చంద్రబాబుకు నీళ్లు విడిచిపెట్టడమా? తెలంగాణ రైతులకు నీళ్లు ఒడిసిపట్టడమా? మీ ఆలోచన ఏమిటి?ఇది ఎల్‌నినో తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు.సమ్మక్క బ్యారేజీ కట్టి, దేవాదుల మూడు ఫేజులు పూర్తి చేసి కేసీఆర్ గారు నీళ్లు ఎత్తడానికి సిద్ధంగా పెట్టారు.మీ నిర్లక్ష్యం వల్ల వరంగల్ జిల్లాను కరువు కోరల్లోకి నెట్టారు.3.17 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వడానికి దేవాదుల పూర్తి చేశాం. అని గుర్తు చేశారు కటుక ఒత్తకుండా ఎందుకు వరంగల్ జిల్లాను ఆగం చేస్తున్నారు?రూ.8 కోట్ల బిల్లులు ఇవ్వకుండా పోయిన ఏడాది 50 రోజులు ఆలస్యంగా మోటార్లు ఆన్ చేశారు.దేవాదుల కింద రూ.700-800 కోట్ల విలువైన పంట ఎండిపోయిందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు ఈసారి కూడా ఎల్‌నినో వస్తుందని చెబుతున్నా మొద్దునిద్ర పోతున్నారా?ఎందుకు పది మోటార్లు నడపడం లేదు?నీళ్లు ఉండి కూడా ఎత్తకుంటే ఏం అనాలి?ఒడిసిపట్టాల్సిన నీళ్లను విడిచిపెడుతున్నారు. ప్రపంచమంతా చుక్క చుక్క నీటిని ఒడిసిపడుతుంటే మీరు నీళ్లు వదిలేస్తున్నారనీ కాళేశ్వరంలో ఎత్తమంటే అక్కడా డ్రామాలు.. ఇక్కడ ఎందుకు ఎత్తరు?రామప్ప కింద 5 వేల ఎకరాలు, పాకాల కింద 29 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.కాంగ్రెస్ మాటలు నమ్మి రైతులు నాట్లు వేసుకున్నారనీ తెలిపారు వరంగల్ కలెక్టర్ అఖిలపక్ష సమావేశం పెట్టి నీళ్లు ఇవ్వం, నాట్లు వేసుకోవద్దు అంటారు.మంత్రులు మాత్రం 3 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని చెప్పారనీ మంత్రులది ఒక మాట, కలెక్టర్‌ది ఒక మాటనా?మంత్రులు కరెక్టా? కలెక్టర్ కరెక్టా?రామప్ప కింద తూములు మూసేశారు. నాట్లు వేసిన రైతుల పరిస్థితి ఏమిటి?గోదావరిలో బ్రహ్మాండంగా నీళ్లు ఉన్నాయి. అయినా కలెక్టర్ ఎందుకు తూములు మూసారు?ఎవరు కరెక్ట్?మంత్రులు రైతులకు క్షమాపణలు చెప్పాలి.రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు ఇది తుగ్లక్ ప్రభుత్వం లెక్క ఉంది. రాష్ట్రాన్ని నడిపే పద్ధతి ఇదేనా?రైతు బోరు ఎండితే నీళ్ల కోసం రకరకాల మార్గాలు వెతుకుతాడు. కానీ ప్రభుత్వం ఎందుకు తపన పడటం లేదు?రైతులు ట్యాంకర్లు, బిందెలతో పంటలకు నీళ్లు పెడుతున్నారు.రైతులకు ఉన్న సోయి రేవంత్ రెడ్డికి లేదనీ దుయ్యబట్టారు తెలంగాణ రైతు ఎంత తపన పడుతున్నాడో రేవంత్ రెడ్డికి అర్థం కావడం లేదు.గ్యారెంటీల విషయంలో వాయిదాల లెక్కనే.. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలే. అని ఆరోపించారు

## పేద కుటుంబాలకు మెయిల్ క్రిష్ణారెడ్డి ఆర్థిక చేయూత...

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి. సుబ్రహ్మణ్యం.జులై.21.**





మండలంలోని పేద కుటుంబాల వారికి మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ అధినేత పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల సేవలతో ఆర్థిక చేయూతను అందించి...వారి వారి రంగాల్లో ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు వారికి వెన్నంటే ఉంటున్నారని ఆ సంస్థ పీ4 ప్రాజెక్ట్ మేనేజర్ బి.చింతయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.రఘురామ్ పేర్కొన్నారు. పీ4(పబ్లిక్-- ప్రైవేట్ -- పీపుల్ -- పార్టనర్‌షిప్) ప్రాజెక్టులో భాగంగా క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆర్థికసాయంతో మండలంలోని దోకిపర్రుకు చెందిన పెయ్యల నాగులుకు రూ.29,500తో జీవనోపాధిగా కిరణా దుకాణం యూనిట్‌ను మెయిల్ ప్రతినిధి చేతన్ చేతుల మీదుగా ఏపీఎంఏఎస్ ద్వారా అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన ముత్యాల తెరేజమ్మకు రూ.15,500విలువైన కూరగాయల వ్యాపారం యూనిట్‌ను అందించారు. పేద కుటుంబాలకు మెయిల్ క్రిష్ణారెడ్డి ఈ సేవలను అందించి ఆయా కుటుంబాలకు కొత్త జీవితాలను ప్రసాదిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. బంగారు మిత్ర ఫరీదా, టీఓటీ జయశ్రీ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## భార్య చేతిని నరికిన భర్త...

**జనసుమద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి. సుబ్రహ్మణ్యం.జులై.21.**



మండలంలోని అంగలూరుకు చెందిన ముత్యాల సురేష్ తన భార్య ముత్యాల హైమావతిని కత్తితో చేతిపై నరికాడు. ఈ దారుణంపై గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే...పోలీసులు కేసు నమోదు చేయటం బాధితురాలు హైమావతి మంగళవారం విలేకరులకు తెలిపారు. అనుమానం జబ్బుతో తన భర్త అస్తమానం తనను వేధిస్తున్నాడని ఆరోపించారు. తనను ప్రేమించి 11ఏళ్ల క్రితం సురేష్ వివాహం చేసుకున్నాడని చెప్పారు. తమకు ఇద్దరు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీన తన చేతిపై కత్తితో తన భర్త నరికాడని హాస్పటల్ నుంచి వచ్చి ఫిర్యాదు చేసినా...గుడ్లవల్లేరు పోలీసులు కేసు నమోదు చేయటం లేదని హైమావతి ఆరోపించారు. తనను నరికిన రోజు స్థానికులు అడ్డుకుంటే...వారిపై కూడా తన భర్త దాడి చేశాడని చెప్పారు. ఆ స్థానికులే పోలీసులకు సమాచారం ఇచ్చినా...కేసు నమోదు చేయటం లేదని ఆరోపించారు. తనను నరకడమే కాకుండా మానసికంగా...శారీకంగా వేధిస్తున్నా ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసులు మహిళలకు ఎక్కడ రక్షణ కల్పిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను బాధించిన కేసుల్లో చాలాసార్లు తన భర్తను పోలీసులు తీసుకెళ్లిన దాఖలాలు కూడా ఉన్నా...అతనిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు హైమావతి కోరారు.

### వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని కలిసి స్థానిక రాజకీయ పరిస్థితులను వివరించిన శాసన మండల సభ్యులు పర్వత రెడ్డి .

**నెల్లూరు, జులై 21, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**



మంగళవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డివైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిశారు.ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి తో చంద్రశేఖర్ రెడ్డి పలు రాజకీయ విషయాలపై చర్చించారు.

జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం



# నేడు టీడీపీ ఆఫీసులో జరుగనున్న ముఖ్య సమావేశం : కొమెర దుర్గారావు

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, జూలై 21;
నేడు అనగా 22.7.2027 బుధవారం మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ లో గల టీడీపీ పార్టీ ఆఫీసులో మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు ముఖ్య మీటింగ్ జరుగుతుంది. కావున మండల పార్టీ అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇంఛార్జ్ లు, కో క్లస్టర్ ఇంఛార్జ్ లు, యూనిట్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇంచార్జ్ లు, కో యూనిట్ ఇంచార్జ్ లు, బూత్ ఇంచార్జ్ లు, కో బూత్ ఇంఛార్జ్ లు, వార్డు అధ్యక్షులు, టీడీపీ మాజీ కౌన్సిలర్ లు, టీడీపీ మహిళా కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్ మరియు మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమెర దుర్గారావు తెలిపారు.
**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..** ప్రతి ఒక్కరూ ఐడీ కార్డు తెచ్చుకోవల్సిందిగా, మై టీడీపీ యాప్ లో ప్రతి ఒక్కరూ ఫోటోలు అప్లోడ్ చేయాల్సిందిగా కోరారు.



కొమెర దుర్గారావు,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్ మరియు మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షులు.

# కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడును కలిసిన ఎంపీ బీద మస్తాన్ రావు, ఏపీ పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

నెల్లూరు, జులై 21, జన సముద్రం జిల్లా ప్రతినిధి.
దేశ రాజధాని ఢిల్లీలోని రాజ్ భవన్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు ని పార్లమెంట్ సభ్యులు బీద మస్తాన్ రావు తో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి డెన్మార్క్లో శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో ఉన్న భారతీయ చిన్నారిని తిరిగి స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

# మున్నూరు కాపు సంఘం స్థలంపై ఎమ్మెల్యే కీలక హామీ





మల్కాజిగిరి జనసముద్రం న్యూస్ జూలై 21
మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచన మేరకు ఓల్డ్ మల్కాజిగిరి, బాల సరస్వతి నగర్లో ఉన్న మున్నూరు కాపు సంఘం స్థలానికి సంబంధించిన భూ రెవెన్యూ రికార్డుల దస్త్రాలను గత వారం రోజుల క్రితం మండల తహసీల్దార్ (ఎమ్మార్వో)ను కోరడం జరిగింది.
ఈ మేరకు 20-07-2026న మండల ఎమ్మార్వో మున్నూరు కాపు సంఘం స్థలానికి సంబంధించిన భూ రెవెన్యూ రికార్డులపై నివేదికను అందించారు.
ఆ నివేదికను మున్నూరు కాపు సంఘం సభ్యులు ఈరోజు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి అందజేశారు.
రికార్డులను పరిశీలించిన అనంతరం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తొ మరియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్తో మాట్లాడి, దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న మున్నూరు కాపు సంఘం స్థలాన్ని తిరిగి మల్కాజిగిరి మున్నూరు కాపు సంఘానికి అప్పగించేలా తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, మున్నూరు కాపు సంఘం నాయకులు గిరి రామకృష్ణ, బి. రామకృష్ణ, రాములు, శ్రీకాంత్, నాగరాజు, కిట్టు, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజినేయస్వామి ని దర్శించుకొన్న జనసైనికులు



జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, జూలై 21;
మాచర్ల నియోజకవర్గానికి చెందిన పలువురు జనసైనికులు తెలంగాణ రాష్ట్రం లోని మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజినేయస్వామి ని దర్శించుకొన్నారు. వారిలో బూసా రామాంజనేయులు, వెల్దుర్తి మండల జనసేన అధ్యక్షులు గంధం మల్లయ్య పలువురు ఉన్నారు.

# కీసర డివిజన్-1 కీసర గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం





కీసర డివిజన్ -1, మేడ్చల్ జిల్లా,
జనసముద్రం న్యూస్. ఎస్. బాలకృష్ణ రెడ్డి :
కీసర డివిజన్ పరిధిలోని కీసర గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను పరిశీలిస్తూ, ప్రజలకు అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ - 1 అధ్యక్షులు శ్రీ రామిడి స్వప్న విజయ్ రెడ్డి , డివిజన్ 1 ఇంచార్జి విజయ సమక్షంలో మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్ శర్మ, మాజీ వార్డు సభ్యుడు ముద్దం వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు రవీందర్, బిఎల్ఏ ఎంఐ సాయి, చింగిన్నె తరుణ్, వెంకట్ యాదవ్, పోచమైన రాజు, మచ్చాని శ్రీశైలం మరియు కాంగ్రెస్ నాయకులు కుమారి కృష్ణ, కందాడి సత్తిరెడ్డి, ముద్దం మల్లేష్, చ్ మహేష్ గౌడ్, వి ఆర్ వో విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావాలని, అలాగే వివరాలలో ఏవైనా మార్పులు లేదా సవరణలు ఉంటే వాటిని వెంటనే నమోదు చేయించుకోవాలని ప్రజలను కోరుతూ ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు మంచి స్పందన తెలిపారు.

# పామర్రు ఎస్ఐ కోడిపందాలపై మెరుపు దాడి.



జనసముద్రం న్యూస్ పామర్రు నియోజకవర్గం ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. జులై.21.
పామర్రు పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. శ్రీ కుడిపూడి శ్రీనివాసు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, ఈ రోజు సాయంత్రం 05:00 గంటలకు, పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని యలకుర్రు గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం 6 మంది నిందితులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ. 5130 నగదు, ఒక కోడిపుంజు, రెండు కత్తులు, మూడు మోటార్ సైకిళ్లు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
ఈ ఘటనకు సంబంధించి నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# ఎమ్మెల్యే నాయకర్ ఆధ్వర్యంలో వేగవంతమైన డ్రైనేజీ పనులు







నరసాపురం జులై 21 జనధముద్రం ధనుంజయ్
నరసాపురం పట్టణంలోని రుస్తుంబాద ప్రాంతంలో జాతీయ రహదారి ప్రక్కన జరుగుతున్న మున్సిపల్ డ్రైన్ డీ-సిల్టింగ్ పనులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా బల్లకట్టు సెంటర్ వద్ద డీ-సిల్టింగ్ పనులను పరిశీలించి, మురుగునీటి పారుదల సజావుగా జరిగేలా అవసరమైన చోట తూరలను వినియోగించాలని, మురుగునీరు-మంచినీరు కలవకుండా సైఫన్ అక్విడక్ట్కు అవసరమైనమరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడకుండా డీ-సిల్టింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.
అనంతరం జాతీయ రహదారి 216 బల్లకట్టు సెంటర్ వద్ద డివైడర్గా ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ స్టికర్ పోల్స్ వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేసి, రహదారి భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఏఎంసి చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, జిల్లా మత్స్యకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, వలవల నాని నిప్పులేటి తారకరామారావు, బందెల రవీంద్ర ,గంట కృష్ణ మరియు అధికారులు జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు పార్కుల్లో హుషారు,ఒపెన్ జిమ్లో పాల్గొన్న మంత్రి నారాయణ

**- ఆరోగ్య నెల్లూరు కిలోమీటర్కో పార్క్, ప్రజలకు అందుబాటులోకి జిమ్ సైకిళ్లఅబ్దుల్ కలాం పార్క్ను సందర్శించిన మంత్రి, కలెక్టర్,కమిషనర్**
**పిల్లలకు ఉయ్యాల ఊపుతూ అలరించిన పురపాలక శాఖ మంత్రి**









నెల్లూరు, జూలై 21, జన సముద్రం జిల్లా ప్రతినిధి.
నెల్లూరు నగర పరిధిలోని 48వ డివిజన్ అబ్దుల్ కలాం పార్క్ను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, కమిషనర్ నందన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ ప్రజలతో కలిసి జిమ్లో పాల్గొనడమే కాకుండా, చిన్నపిల్లలను ఉయ్యాల ఊపుతూ వారితో సరదాగా గడిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే అభివృద్ధి చేసిన 48 పార్కులకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రంతో సీఎం విజన్ 2047 ఆరోగ్య ఆంధ్ర సాధన వైపు ఇది ఒక ముఖ్యమైన అడుగు అని స్పష్టం చేశారు. మంత్రి నారాయణ ఆలోచన మేరకు ప్రతి నివాస ప్రాంతానికి కేవలం 1 కిలోమీటరు పరిధిలోనే ఒక డీసెంట్రలైజ్డ్ పార్క్ అందుబాటులోఉండేలాచర్యలు తీసుకుంటున్నామని, దీనివల్ల మహిళలు, వృద్ధులు ఇళ్లకు దగ్గరలోనే వ్యాయామం, వాకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా ప్రజల కోరిక మేరకు రాబోయే రోజుల్లో పార్కుల్లో మరిన్ని జిమ్ సైకిళ్లను కూడా అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి,రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు,48వ డివిజన్ అధ్యక్షుడు పెంచాలయ్య,47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చెంగయ్య ఆచారి,గణేష్,గోపి, స్థానిక టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షంలోనూ జర్నలిస్టుల గర్జన.






**- అక్రిడిటేషన్ కార్డుల జాప్యం పై రోడ్డెక్కిన జర్నలిస్టులు**
**- అర్హులందరికీ వెంటనే కార్డులు ఇవ్వాలని డిమాండ్..**

జనసముద్రం రాజన్న సిరిసిల్ల జిల్లా ,జులై 21
రాజన్న సిరిసిల్ల: అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న తీవ్ర జాప్యానికి నిరసనగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టి యు డబ్ల్యు జె -హెచ్143) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో కలెక్టరేట్ కార్యక్రమం భారీ విజయాన్ని సాధించింది. జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామల గట్టు రెడ్డిమల్ల సత్యనారాయణ నాయకత్వంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జర్నలిస్టులు భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కలెక్టరేట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో అర్హులైన జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయకుండా నెలల తరబడి పెండింగ్లో ఉంచడం వల్ల జర్నలిస్టులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రయాణ సౌకర్యాలు, ఇతర అధికారిక గుర్తింపు ప్రయోజనాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఆరు నెలల్లో బస్సు పాస్ను ఆరుసార్లు రెన్యువల్ చేయించుకోవాల్సిన దుస్థితి రావడం తెలంగాణ జర్నలిస్టు సమాజాన్ని అవమానించే చర్యేనని మండిపడ్డారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల కోసం భారీ వర్షంలోనూ రోడ్డెక్కాల్సిన పరిస్థితి ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ఏమాత్రం మంచిది కాదని హెచ్చరిస్తూ, ప్రభుత్వం ఇకనైనా స్పందించి అర్హులందరికీ వెంటనే పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.
ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న కలెక్టరేట్ అధికారి అక్కడికి చేరుకుని నాయకుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు.
ఈ సందర్భంగా "జై తెలంగాణ... జై జై తెలంగాణ", "జోహార్ తెలంగాణ జర్నలిస్టు అమరవీరులు", "వుయ్ వాంట్ జస్టిస్", "అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలి" అంటూ జర్నలిస్టులు నినాదాలు చేయడంతో కలెక్టరేట్ ప్రాంతం మారుమోగింది.
ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ , ప్రింట్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కాశీ నుండి తీసుకువచ్చిన శివలింగానికి ప్రత్యేక పూజలు





మొగల్తూరు జూలై 21 జనసముద్రం
పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్ గ్రామములో చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీ పార్వతీ చంద్రమౌళి స్వామి వారి ఆలయానికి కాశీ మహా పుణ్యక్షేత్రం నుండి నూతన శివలింగాన్నిమంగళవారంఉదయం తీసుకురావడం జరిగింది. వారణాసి పుణ్యక్షేత్రం నుండి తీసుకొచ్చిన శివలింగమును ప్రత్యేక పల్లకిలో గ్రామంలో ఊరేగించి శ్రీ పార్వతి చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయం నందు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో కాశీ నుండి తీసుకువచ్చిన శివలింగంను దర్శించుకుని ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భారతదేశంలో అత్యంత ప్రీతివంతమైన వారణాసి పుణ్యక్షేత్రం నుండి తీసుకువచ్చిన శివలింగమును గ్రామానికి చెందిన పెద్దలు భక్తులు మహిళలు పిల్లలు దర్శించుకున్నారు.

# భక్తాంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ

మొగల్తూరు జూలై 21 జనసముద్రం



పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కే.పి.పాలెం నరసాపురం మండలం తూర్పు తాళ్ళు గ్రామాల మధ్య చోటా హనుమాన్ సెంటర్లో వేంచేసియున్న శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. గ్రామం నలుమూలల నుండి సుమారుగా 300 మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదమును స్వీకరించారు. కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు.

# నూతన గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇన్ చార్జ్ కు చంద్రశేఖర్ రెడ్డి అభినందనలు.



నెల్లూరు, జులై 21, జన సముద్రం జిల్లా ప్రతినిధి.

నెల్లూరు జాతీయ రహదారి వద్ద వైఎస్ఆర్సిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నివైసిపి గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నూతనంగా నియమితులైన బూదురు గురవయ్య కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బూదురు గురవయ్య నూతన బాధ్యతలు చేపట్టినందుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

పార్టీ నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

# డెంగ్యూ వ్యాధి పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి





ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, జూలై 21:

డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు" పురస్కరించుకొని ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ భావన ఆదేశాలమేరకు సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో రాచపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించడం జరిగింది.సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతు డెంగ్యూ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు,1.చెక్,2.క్లీన్,3.కవర్ విధానాలను విధిగా అనుసరించాలని,డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయో వివరించడం జరిగింది. ప్రతి ఒక్క కుటుంబము దోమతెరలలోనే నిద్రించాలని తెలియపరిచారు. అలాగనే ప్రతిఒక్కరు కూడా వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలియపరిచారు.జ్వరము వచ్చిన వెంటనే వైద్యాధికారి సమక్షంలోరక్తపరీక్షలుచేయించుకోవాలనితెలియపరిచారు .పబ్లిక్ హెల్త్ నర్స్ వెంకటసుబ్బమ్మ మాట్లాడుతు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రాకుండా 14 సంవత్సరాల బాలికలు హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు.సూపర్వైజర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతు కరోనా బారిన పడకుండా మాస్కులు ధరించాలని దగ్గినప్పుడు,తుమ్మినప్పుడు చేతి రుమాలును అడ్డం పెట్టుకోవాలని తెలియజేశారు.స్త్రీ సూపర్వైజర్ సుజాత మాట్లాడుతు భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కుని భోజనం చేయాలని,వేడి పదార్థాలనే భుజించాలని సూచించారు.చివరిగా విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు పలికించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జమాల్ రెడ్డి గారు,ఉపాధ్యాయ బృందం,స్త్రీ ఆరోగ్య కార్యకర్తలు నాగరాణి,శశికళ ఆశా కార్యకర్త నాగమణి పాల్గొనడం జరిగింది.

# ప్రైవేటు దస్తావేజు లేఖర్లకు చట్టబద్ధమైన గుర్తింపు ఇవ్వండి.
## జీవో నెంబర్ 369ను తక్షణమే రద్దు చేయండి . బి. మస్తాన్ రావు.



జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,జులై 21

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 369 అనేది దస్తావేజు లేఖర్ల వృత్తికి , వారి జీవనోపాధికి వ్యతిరేకంగా ఉన్న జీవోను వెంటనే రద్దు చేయాలని బి. మస్తాన్ రావు మాచర్ల పట్టణ విలేకరుల సమావేశం నందు తెలిపారు. ఈ జీవో కారణంగా తమ సేవలను అందించటానికి అనుమతి లేకుండా ఉండటంవల్ల , దీని ప్రభావం వల్ల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని మాచర్ల పట్టణ ప్రైవేట్ డాక్యుమెంట్ రైడర్స్ ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రతిపాదించే ఆన్లైన్ / డిజిటల్ సేవల్లో తమకు భాగస్వామ్యం కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

# జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి :
## చక్రవాకం సత్యనారాయణ రాజు పిలుపు

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, నర్సరావుపేట, జూలై 21:



సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీన సిపిఐ నరసరావుపేట నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ వై.చెంచయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తదితరులు పాల్గొంటారని ఆయన అన్నారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపైన భవిష్యత్తు కార్యక్రమం రూపొందించేందుకు ఈ సమావేశం చర్చిస్తుందని కావున పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, ప్రజా సంఘ నాయకులు అందరు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్కే చిన్న జాను సైదా,సిపిఐ మండల కార్యదర్శి రోడ్ద అంజిరెడ్డి,సిపిఐ మండల కన్వీనర్ కోయ శీను, బ్రహ్మయ్య, బ్రహ్మం, యు. రాజు, చిట్యాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు స్వల్పగాయం..!
## ఈ సంఘటన జరగటం చాలా బాధాకరం : నవులూరి శివారెడ్డి



నవులూరి శివారెడ్డి,
అమరావతి పార్టీ మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి.

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, జూలై 21:

కాకినాడ పోర్టులో మంచు మనోజ్, బాలకృష్ణ పై మలినేని గోపీచంద్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా షూటింగ్ సందర్భంగా యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా బాలకృష్ణ మోకాలికి గాయం కావడం చాలా బాధాకరం అని అమరావతి పార్టీ మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి అన్నారు. ఈ సంఘటన పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన మోకాలి గాయం నుంచి త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక మీదట సినిమా షూటింగ్ విషయం లో ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల పట్ల బాలయ్య జాగ్రత్తగా ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

# ఆటకోడుకు గట్లు జారిపోతున్న వైనం.





- తవ్వకాల్లో సాగునీటి సంఘాల నిర్వాకం.
- కట్టలు తెగి పంట భూముల్లోకి సాగునీరు ఎక్కే ప్రమాదం.





జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి.
సుబ్రహ్మణ్యం.జులై.21.

మండలంలోని కౌతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలోని వందలాది ఎకరాలకు నీరందించే ఆటకోడు పంట కాలువను గతంలో లోతు ఎక్కువతో సాగునీటి సంఘాల వారు అడ్డదిడ్డంగా తవ్వేశారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వేసరికి సాగునీటి ప్రవాహ తాకిడికి ఈ కాల్వకు ఇరువైపులా ఉన్న గట్లు కాల్వలోకి తెగి జారిపడిపోతున్నాయి. కట్టలు తెగి పంట భూముల్లోకి సాగునీరు ఎక్కే ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్అధికారులకుఎన్నిసార్లు విన్నవించినా.. .పట్టించుకోవటం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ సాగుకు కూటమి ప్రభుత్వం అరకొర సాగునీటిని విడుదల చేయటంతో 'నీరు పల్లం ఎరుగును అన్న చందంగా' ఈ ఆటకోడు కాల్వలోకే సాగునీరు ఎక్కువగా సరఫరా అవుతోంది. దీనితో సుబ్బారాయుడు కాల్వ కింద సాగు చేస్తున్న వందలాది ఎకరాల రైతులకు సాగునీరు అందటం లేదు. తీరా వంతుల వారీగా ఇరిగేషన్ అధికారులు సాగునీరు అందించినా...సమస్య తీరటం లేదు. ఈ సమస్యతో వివిధ ప్రాంతాలకు చెందిన రైతుల మధ్య వివాదాలు ఏర్పడ్డాయి. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణను వివరణ కోరగా ఆటకోడు కాల్వ గట్లు తెగి పడిపోతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఆ కాలువ పనులను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మసి పూసి మారేడుకాయ...

**కోటప్రోలు నాగు, వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ**

ఆటకోడు పంట కాలువ తవ్వకాల పనుల్లో నిబంధనలకు నీళ్లు వదిలి మసి పూసి మారేడుకాయ చేశారు. ఆ కాల్వ పనుల్లో పటిష్టంగా కట్టలు వేయకుండా తూతూ మంత్రంగా పనులు చేశారు. అంతంతమాత్రంగా వేయటంతో అందుకే ఆ కట్టలు కాల్వలోకి జారి పడిపోతున్నాయి. వెంటనే ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోకపోతే రైతుల నుంచి ఆందోళనలు తప్పవు.

దినదిన గండమే...

**నందం శ్రీనివాసరరావు, చంద్రాల మాజీ ఉప సర్పంచి**

మా ప్రాంతంలోని రైతులకు వ్యవసాయం చేయాలంటే దినదిన గండంగా మారింది. ఆటకోడు కాలువను లోతు ఎక్కువగా తవ్వటం వలన సుబ్బారాయుడు కాల్వకు నీరందక మా ఆకుమళ్లన్నీ ఎండిపోతే...రైతులు వాటిని కదుమ మండి తగులబెట్టుకుంటున్నారు.

ఆటకోడు కాల్వకు గట్లు తెగిపోవటం వలన పంటలు మునిగిపోయే ప్రమాదం పొంచి ఉంది.

# మీ భద్రత - మా బాధ్యత




- మహిళల భద్రత అవగాహన కార్యక్రమాలు చేపట్టిన రైల్వే కోడూర్ సిఐ, ఎస్సై, రెవెన్యూ, అంగన్వాడి డిపార్మెంట్లు..
- రైల్వే కోడూర్ మండల రెవిన్యూ అధికారి వారి ఆఫీస్ ఆవరణ లో మహిళల భద్రతపై అవగాహన సదస్సు..!!

తిరుపతి జిల్లా ఇన్చార్జి న్యూస్
జూలై 21 జన సముద్రం న్యూస్

తిరుపతి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ ఓయ్ శ్రీనివాసులు పర్యవేక్షణలో రైల్వే కోడూరు పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సి చంద్ర శేఖర్ , రైల్వే కోడూర్ మండల రెవిన్యూ అధికారి వారి ఆఫీస్ ఆవరణ లో మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించబడింది.

ఈ కార్యక్రమం లో రైల్వే కోడూరు పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సి.చంద్ర శేఖర్ మాట్లాడుతూ, మహిళల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలు ఎలాంటి వేధింపులు, బెదిరింపులు, గృహ హింస, లైంగిక వేధింపులు లేదా ఇతర నేరాలకు గురైన వెంటనే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రతి మహిళ తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, చట్టం మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు మరియు మహిళలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులు, వీడియో కాల్స్, ఓటిపిలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్లు, పాస్‌వర్డ్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించరాదని హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. అదేవిధంగా, యువత మరియు విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వినియోగం ఆరోగ్యాన్ని, విద్యను, కుటుంబ జీవితాన్ని మరియు భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు... మహిళలు ప్రయాణాల సమయంలో భద్రతా జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే సందర్భాల్లో కుటుంబ సభ్యులకు తమ ప్రయాణ వివరాలు తెలియజేయడం, వాహనం నంబర్‌ను నమోదు చేసుకోవడం, అవసరమైతే లైవ్ లొకేషన్‌ను షేర్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112 పోలీస్ ఎమర్జెన్సీ సర్వీస్, 181 మహిళల హెల్ప్‌లైన్ మరియు 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని వివరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు ఫిర్యాదు చేయడం ద్వారా ఆర్థిక నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రైల్వే కోడూర్ మండల రెవిన్యూ అధికారి అమర్నాథ్ , ఏపీ ఎం వెలుగు వసుందర , ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలా దేవి, కోడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ సంధ్య , వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ చేతుల మీదుగా ఏపీఆర్‌జేసీ విజయపురి సౌత్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జనసముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,జూలై 21



విజయపురి సౌత్, : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన "షైనింగ్ స్టార్స్ ఎస్ఎస్‌సీ2026 & ఇంటర్మీడియట్ ప్రతిభా పురస్కారాల" కార్యక్రమంలో ఏ.పీ. రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, విజయపురి సౌత్ విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ఘన సత్కారం అందుకున్నారు.

కళాశాలకు చెందిన కరిదేసి జెశ్వంత్ రాజ్ (బైపీసీ) ఇంటర్మీడియట్ పరీక్షల్లో 985 మార్కులు సాధించగా, మదల సిద్ధు వేణేశ్ కుమార్ (ఎంఈసీ) 941 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ వారి ప్రతిభను అభినందిస్తూ ప్రతి విద్యార్థికి రూ.20,000 నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం (సర్టిఫికెట్) అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విజేత విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయానికి కృషి చేసిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, విజయపురి సౌత్, పల్నాడు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంట నమోదు, పంట భీమాతో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందండి

## పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు మండల వ్యవసాయ అధికారి సజ్జ మనోహర్ పిలుపు

అర్థవీడు, జూలై 21 (జన సముద్రం న్యూస్)





అర్ధవీడు మండలంలోని రంగాపురం, యాచవరం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి సజ్జ మనోహర్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్2026 సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు అతివృష్టి, అనావృష్టి కారణంగా కలిగే నష్టాలకు ప్రభుత్వం అందించే పంట నష్టపరిహారం, పంట భీమా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, మద్దతు ధర, సున్నా వడ్డీ రుణాలు తదితర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతాయని తెలిపారు.

ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద రైతులు స్వయంగా ప్రీమియం చెల్లించి పంట భీమా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో వరి, కంది, సజ్జ, మినుములు, నువ్వులు, ఎండుమిరప పంటలు దిగుబడి ఆధారంగా, పత్తి పంట వాతావరణ ఆధారంగా భీమా పరిధిలో ఉన్నాయని వివరించారు.

కంది, సజ్జ, మినుములు, నువ్వులు, ఎండుమిరప, పత్తి పంటలకు జూలై 31 వరకు, వరి పంటకు ఆగస్టు 15 వరకు భీమా నమోదు గడువు ఉందని తెలిపారు.

పంట భీమా నమోదు కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా వివరాలు, మొబైల్ నంబర్తో సమీపంలోని మీసేవ, సీఎస్సీ కేంద్రం లేదా బ్యాంకులో నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

ఎకరాకు రైతు వాటా ప్రీమియం వరికి రూ.860, కందికి రూ.430, సజ్జకు రూ.156, మినుములకు రూ.205, నువ్వులకు రూ.180, ఎండుమిరపకు రూ.4,500, పత్తికి రూ.2,100గా నిర్ణయించినట్లు తెలిపారు. పంట భీమాపై సందేహాలు ఉంటే సమీప రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో వీహెచ్ఏలు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.